ఈనాడు కర్నూలు

శుక్రవారం అక్టోబరు 25, 2024 7



శ్రీమఠంలో అందెల సవ్వడి

కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన తన్వీ ప్రకాశ్ తన 99వ భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. శ్రీమారికాంబ నృత్యకళా కేంద్రం నిర్వాహకులు స్మితాప్రకాశ్ ఆధ్వర్యంలో 30 మంది కళాకారులు గురువారం శ్రీమఠం ప్రవచన మందిరంలో నాదనెమనె కార్యక్రమంలో భాగంగా నిర్వాహకుడు పద్మనాభాచార్ ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. మంత్రాలయం, న్యూస్‌టుడే:

భూసమస్యల పరిష్కారానికి గ్రామ సభలు: కలెక్టర్

గోనెగండ్ల, న్యూస్‌టుడే: రీసర్వే గ్రామాల్లో తలెత్తిన భూసమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. గురువారం ఆయన గోనెగండ్ల మండలం కున్నూరులో తహసీల్దార్ కుమారస్వామి నిర్వహిస్తున్న గ్రామసభను పరిశీలించారు. రైతుల వినతులపై రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. భూసమస్యలపై రైతులు ప్రతి సోమవారం జిల్లా కేంద్రానికి రాకుండా స్థానికంగానే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామసభల్లో సబ్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, సర్వేయర్ తదితర అధికారులందరూ పాల్గొని ప్రజల వినతులను స్వీకరిస్తారన్నారు. అవసరమైతే సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్ర స్థాయిలో భూసర్వే నిర్వహిస్తారన్నారు. గ్రామానికి సీసీ రోడ్లు మంజూరు చేయాలని కోరగా, వెంటనే వేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, శిక్షణ కలెక్టర్ చల్లా కల్యాణి, సర్వే ఏడీ మునికన్నన్ ఉన్నారు.



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

భావితరం గజగజ

- విద్యార్థులకు అందని దుప్పట్లు
- వసతిలో కొరవడిన సౌకర్యాలు



రేకుల షెడ్డులో వణుకు


మండిగిరి బీసీ వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరింది. గదుల్లో పైకప్పు దెబ్బతిని కడ్డీలు బయటకు తేలాయి. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇక్కడ మొత్తం 252 మంది ఉంటున్నారు. రాత్రి వేళ రేకుల షెడ్డులో వంద మంది వరకు నిద్రించాల్సిన పరిస్థితి నెలకొంది. చలికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. –ఆదోని గ్రామీణ, న్యూస్‌టుడే

తొలి మంచు 'తెర'తీసింది.. చలి గాలుల తీవ్రత పెరిగింది.. రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి.. వణుకు మొదలైంది.. వసతి గృహాల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.. గత ఐదేళ్లలో వైకాపా పట్టించుకోలేదు.. వసతి గృహాల భవనాలు అధ్వానంగా మారాయి.. తలుపులకు రంధ్రాలు పడ్డాయి.. కిటికీలకు తలుపులు లేవు.. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదు.. భావితరం చలికి వణుకుతోంది.. దోమలు బాలల రక్తం తాగుతున్నాయి.. అధికారులు స్పందించి చలి తీవ్రత పెరగకముందే దుప్పట్లు అందజేయాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే :

ఆస్పరిలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో 46 మంది విద్యార్థులు ఉంటున్నారు. కిటికీలకు తలుపులు లేవు, రాత్రి సమయంలో నిద్రపోవడానికి ముందుగా విద్యార్థులు తలుపులు లేని కిటికీలకు పాత దుస్తులు అడ్డుగా పెట్టారు. వీటిని ఇళ్ల నుంచి తెచ్చుకున్నారు.

- న్యూస్‌టుడే, ఆస్పరి



ఒక్కరికీ ఇవ్వలేదు

విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 212 వసతి గృహాలకు ఇంతవరకు దుప్పట్లు సరఫరా చేయలేదు. చలి నుంచి రక్షణ కల్పించే రగ్గులు ఇవ్వలేదు.. విద్యార్థులంతా నేలపైనే నిద్రిస్తున్నారు.. కొందరు ఇంటి నుంచి తెచ్చుకున్న వాటితో రక్షణ పొందుతున్నారు. మరికొందరు ఇద్దరు, ముగ్గురు కలిపి ఒకే దుప్పటి కప్పుకొంటున్నారు.



ముగ్గురికి ఒక్కటే



ఎమ్మిగనూరు బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు దుప్పట్లు లేక రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మిగనూరు గ్రామీణం:



కటిక నేలనే దిక్కు

పెద్దపాడు ఎస్సీ బాలుర వసతిగృహంలో 190 మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. గదులు సరిపోవడం లేదు.. ప్రభుత్వం దుప్పట్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొందరు కటిక నేలపైనే పడుకున్నారు.

– ఈనాడు, కర్నూలు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు ఎస్సీ వసతి గృహ విద్యార్థులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఉన్నారు. గదుల్లో పంకాలు లేకపోవడంతో దోమలతో అవస్థలు పడుతున్నారు. ఫ్యాన్లు లేకపోవడంతో ఆరుబయట నిద్రిస్తున్నారు. ఒక్కదాన్ని ఇద్దరు, ముగ్గురు కప్పుకొంటూ కాలం వెళ్లదీస్తున్నారు.



ఆరుబయట నిద్ర

దాతలు దయతలిస్తేనే

శీతాకాలం ప్రారంభమైంది.. ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు గజగజ వణికిపోతున్నారు. వీరికి ఇప్పటి వరకు దుప్పట్లు ఇవ్వలేదు.. కొందరు ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకున్నారు.. మరికొందరు చేసేది లేక నేలపైనే నిద్రిస్తున్నారు. చలితో వణుకుతూ దోమలతో యుద్ధం చేస్తున్నారు.. విద్యార్థులకు దాతలు చేయూత ఇస్తే బాగుంటుంది.

సాంఘిక 'సంక్షేమం' మరిచారు

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు కర్నూలు జిల్లాలో 68, నంద్యాల జిల్లాలో 38 ఉన్నాయి. వీటిలో 7,905 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ వసతిగృహాల్లో కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కచోట కూడా పూర్తిస్థాయిలో వసతులు లేవు. కిటికీలు, తలుపులు సరిగ్గా లేవు. దీనికితోడు దుప్పట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు.

నాలుగేళ్లుగా బాలికల అవస్థ

ఉమ్మడి జిల్లాలోని 53 కస్తూర్బా విద్యాలయాలకు నాలుగేళ్లుగా దుప్పట్లు పంపిణీ చేయలేదు. గత వైకాపా ప్రభుత్వం కేజీబీవీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నాలుగేళ్లుగా వేలాది మంది విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేజీబీవీలు చాలా వరకు మండల కేంద్రాలు, పట్టణాలకు దూరంగా ఉండటంతో చలి తీవ్రతకు విద్యార్థినులు వణికిపోతున్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో ఎక్కడా సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయలేదు.

11,464 మందికి ఇక్కట్లు

కర్నూలు జిల్లాలో 31 బీసీ వసతిగృహాలు, నంద్యాలలో 34 ఉన్నాయి. వీటిలో 11,464 మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ వసతిగృహాల్లోనే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. వీరికి ఇంతవరకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడం గమనార్హం.



ముంబయిలో నిర్వహించిన బూట్ క్యాంపులో అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

ట్రిపుల్ ఐటీలో డ్రోన్ పాఠాలు

- విద్యా సంస్థల్లో బూట్ క్యాంపుల ఏర్పాటు
- ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాలకు గుర్తింపు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : నేటి ప్రపంచంలో డ్రోన్ల వినియోగం పెరిగిపోయింది. ప్రతి అంశంలోనూ డ్రోన్లపై ఆధారపడాల్సి వస్తోంది. రానున్న రోజుల్లో వీటి సేవలు మరింత విస్తృతం కానున్నాయి. ఉపాధి అవకాశాలూ మెండుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'కెపాసిటీ బిల్డింగ్ ఫర్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్ యూఏఎస్/ డ్రోన్ (స్వయాన్) టెక్నాలజీ' ప్రాజెక్టును కేంద్రం రూపొందించింది. ఇది ఒక జాతీయ ప్రణాళిక. 2030 నాటికి గ్లోబల్ డ్రోన్ హబ్‌గా మార్చడమే స్వయాన్ లక్ష్యం. ఈ ప్రాజెక్టులో కర్నూలు ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాల భాగస్వామ్యంగా ఉంది. ఇందులో భాగంగా 2024, ఏప్రిల్ 4వ తేదీన కళాశాలలో డ్రోన్ స్టూడియోను ప్రారంభించారు. ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఏటా 10,950 మందికి శిక్షణ

ఈ ఏడాదిలో కర్నూలు ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాల తరఫున 10,950 మంది ఔత్సాహవంతులకు డ్రోన్ సాంకేతికతపై శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడం, డ్రోన్ టెక్నాలజీ రంగంలో విద్యార్థులకు అత్యుత్తమ నైపుణ్యాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇలా.. ఏటా వేలాది మంది విద్యార్థులకు డ్రోన్ల సాంకేతికతపై అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు నైపుణ్యాలు మెరుగుపరుస్తారు.



కర్నూలు ట్రిపుల్ ఐటీ(డీఎం) కళాశాలలో డ్రోన్ ల్యాబ్ స్టూడియో

ఓర్వకల్లులో హబ్

డ్రోన్ల సేవలు విస్తృతమవుతున్న నేపథ్యంలో యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ ఇన్నోవేషన్ కేంద్రంగా, అమరావతిని డ్రోన్ సిటీ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. డ్రోన్ హబ్ అభివృద్ధి కోసం ఓర్వకల్లులో 300 ఎకరాలు కేటాయించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

నైపుణ్యం పెంపొందించేలా

- కర్నూలు ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాలలో చేపట్టిన డ్రోన్ ప్రాజెక్టులో భాగంగా గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ టెక్నాలజీ (జీఎన్‌సీ)ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్ణయించారు. జీఎన్‌సీ విధానంలో డ్రోన్లకు స్వయంగా మార్గదర్శకత్వం, నావిగేషన్ కంట్రోల్ సిస్టమ్ రూపొందిస్తారు. ఫలితంగా మానవ నియంత్రణ లేకుండా నిరంతరం పని చేసే సామర్థ్యం ఉంటుంది.
- డ్రోన్ టెక్నాలజీపై ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగా కర్నూలు, అనంతపురం, గుంటూరులో ఉన్న పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో డ్రోన్ల సాంకేతికతపై బూట్ క్యాంప్‌లు నిర్వహించారు. ముంబయిలో ఇండియన్ నేవీ, తమిళనాడులోని సోనా టెక్నాలజీ కళాశాలలోనూ బూట్ క్యాంపులను కర్నూలు ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాల ఆధ్వర్యంలో జరగడం విశేషం.

కంటిపాపను చూడకనే.. కన్నుమూశారు



నాలుగు నెలలు గడిస్తే.. నాన్నా అనే పిలుపు వినేవారు. ఐదేళ్ల ఎదురుచూపులు ఫలించకుండానే.. నూరేళ్లు నిండాయి. తన భర్తకు బిడ్డను కానుకగా ఇవ్వాలనుకున్న తల్లి తల్లడిల్లుతోంది. పుట్టబోయే చిన్నారికి ఏం పేరు పెట్టాలనే బాసలు విషాదంగా మారాయి. రహదారి ప్రమాదం ఆ ఇంటిని కన్నీటి సంద్రంగా మార్చింది. తల్లిదండ్రులకు కుమారుడిని, భార్యకు భర్తను, పుట్టబోయే బిడ్డకు తండ్రిని దూరం చేసింది. కౌతాళం మండలం అగసలదిన్నె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.సిద్ధ(24) అనే యువకుడు మృతిచెందారు.

- న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు, కౌతాళం

కౌతాళం మండలం అగసలదిన్నె గ్రామానికి చెందిన శ్రీనివాస్, మహాలింగమ్మ దంపతుల కుమారుడు కె.సిద్ధ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఐదేళ్ల కిందట కర్ణాటక రాష్ట్రం రారావి గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహం అయింది. పెళ్లై ఐదేళ్లు గడిచినా.. కె.సిద్ధ, లక్ష్మి దంపతులకు సంతానం కలగలేదు. పిల్లల కోసం ఎక్కని ఆస్పత్రి మెట్లు లేవు.. మొక్కని దేవుడు లేరన్నట్లుగా అంతటా తిరిగారు. వారి ప్రయత్నాలు ఫలించి ఐదు నెలల కిందట లక్ష్మి గర్భం దాల్చారు. ఐదో నెల కావడంతో కాన్పు కోసం లక్ష్మి పుట్టిల్లైన రారావి గ్రామానికి వెళ్లారు. మరో నాలుగు నెలల్లో తమ ఇంట చిన్నారి అడుగు పెడుతుందని దంపతులిద్దరూ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సిద్ధ గురువారం మధ్యాహ్నం సమయంలో బాపురం గ్రామంలోని బంధువుల పొలంలో పత్తిని విడిపించేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా.. ఎదురుగా కర్ణాటక రాష్ట్రం కొప్పాల్ తాలుకా సిద్ధాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ, వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనంపై మంత్రాలయం వెళ్తుండగా.. అగసలదిన్నె సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయన్నారు. ఈ ప్రమాదంలో సిద్ధ అక్కడికక్కడే మృతిచెందారు. సత్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించాలని వైద్యులు సూచించారు.



కర్నూలు: రహదారిపై నిలిచిన వాహనాలు



సరకును షెడ్డులోనే నిల్వ చేసిన వ్యాపారులు

- వ్యవసాయ మార్కెట్‌కు భారీగా దిగుబడులు
- ఈ-నామ్‌కు సర్వర్ సమస్య

ఉల్లి.. వెల్లువెత్తి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉల్లి మార్కెట్లో కొనుగోళ్ల లొల్లి సమసిపోలేదు. ఈ-నామ్ సర్వర్ పనిచేయక పంట అమ్మకానికి నిరీక్షణ తప్పడం లేదు.. అర్ధరాత్రి వరకు రోడ్లపై జాగరణ చేయాల్సి వస్తోంది. ఉల్లి దిగుబడులు పోటెత్తడంతో నగరంలో కర్నూలు బస్టాండు నుంచి అశోక్ నగర్ వైపు లారీలు, ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు బారులు తీరాయి. గురువారం 19,711 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా కనిష్ఠ ధర రూ.444, గరిష్ఠ ధర రూ.4,639 పలికింది.

శని, ఆదివారాల్లో నిలిపివేత

గత నాలుగు రోజులుగా ఉల్లి ఉత్పత్తులు పోటెత్తుతున్నాయి. 40 వేల బస్తాలకు పైగా అమ్మకానికి వచ్చాయి. ఆన్‌లైన్ టెండరులో సాంకేతిక లోపాల నేపథ్యంలో కాటాలు, లోడింగ్ ఆలస్యమవుతోంది.. దీంతో నిత్యం మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్.విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 5 నుంచి 10 గంటల వరకు మాత్రమే క్రయవిక్రయాలకు అనుమతిస్తామన్నారు. శని, ఆదివారాల్లో ఉల్లి క్రయవిక్రయాలు జరగవన్నారు.

నేడు ఉల్లి ఉత్పత్తులే తీసుకురండి

శుక్రవారం ఉల్లి ఉత్పత్తులకు సంబంధించి మాత్రమే క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్. విజయలక్ష్మి తెలిపారు.

వ్యాపారుల స్వార్థం.. రైతులకు శాపం

నిబంధనల ప్రకారం సరకు కొనుగోలు చేసిన వ్యాపారులు వెంటనే దిగుబడులను తరలించాల్సి ఉంది. రోజుల తరబడి సరకును మార్కెట్‌లోనే ఉంచేస్తున్నారు. ఫలితంగా రైతులు తీసుకొచ్చిన సరకును అన్‌లోడ్ చేయలేని పరిస్థితి ఏర్పడింది. విపణికి పెద్దఎత్తున దిగుబడులు వస్తున్న నేపథ్యంలో మార్కెట్ కమిటీ అధికారులు పర్యవేక్షించి ఎప్పటికప్పుడు వ్యాపారుల సరకును బయటకు పంపేలా చూడాల్సి ఉండగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. మరోవైపు ఈ-నామ్‌కు సర్వర్ సమస్యలు వేధిస్తున్నాయి. ఫలితంగా దిగుబడులకు టెండరు వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ర్యాగింగ్‌కు పాల్పడిన వ్యక్తులకు కఠిన శిక్షలు విధిస్తారని.. పలు సెక్షన్ల ప్రకారం జైలుశిక్ష, లేదా జరిమానా పడుతుందని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అన్నారు. కర్నూలు వైద్య కళాశాలలో ర్యాగింగ్ జరిగినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ, కమిటీ సభ్యులు, మూడో పట్టణ ఎస్సై మన్మథ విజయ్‌తో గురువారం చర్చించారు. అనంతరం సీనియర్ వైద్య విద్యార్థులతో మాట్లాడారు. ర్యాగింగ్‌లో పాల్గొన్నవారికి.. ప్రోత్సహించినవారికి శిక్షలు ఉంటాయని, దీనిని గుర్తుంచుకోవాలని చెప్పారు. భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

డీఆర్వోగా నారాయణమ్మ



సీవీ నారాయణమ్మ

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం స్పెషల్ కలెక్టర్ సీవీ నారాయణమ్మను కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారిణిగా నియమించారు. ప్రస్తుతం డీఆర్వోను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. నంద్యాల జిల్లా డీఆర్వోగా డి.రామునాయక్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సెలవులో డీఎఫ్‌వో

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా విపత్తు స్పందన అగ్నిమాపకశాఖ అధికారి అవినాష్ జయసింహ సెలవులో వెళ్లారు. ఆయన తన కాలికి శస్త్రచికిత్స చేయించుకోవడంతో నవంబరు 14వ తేదీ వరకు సెలవులో వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆ శాఖ ప్రాంతీయ అధికారి భూపాల్‌రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

కర్నూలు పెద్దాస్పత్రి పర్యవేక్షకుడిగా డా.వెంకటేశ్వర్లు?

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు సర్వజన వైద్యశాల పర్యవేక్షకుడిగా డా.వెంకటేశ్వర్లును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ప్రస్తుత ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రభాకరరెడ్డిని తొలగించి ఆయన స్థానంలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లును నియమించినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆయనతోపాటు వైకాపాతో అంటకాగిన పలువురికి స్థానభ్రంశం కలిగించినట్లు సమాచారం.

పర్యాటకంలో మాజీల పెత్తనం

- డీవీఎంకు మాజీ ఎమ్మెల్యేల అండ
- గడువు ముగిసినా కొనసాగింపు
- అడ్డగోలుగా క్రీడా సమాఖ్య కార్యదర్శి తొలగింపు



ఈనాడు, కర్నూలు: వైకాపా అధికారం కోల్పోయి తెదేపా అధికారంలోకి వచ్చినా వైకాపా మాజీ ఎమ్మెల్యేల హవా ఉమ్మడి జిల్లాలోని పలుశాఖల్లో కొనసాగుతోంది. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి సన్నిహిత బంధువైన చంద్రమౌళీరెడ్డి కర్నూలు జిల్లా పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజినల్ మేనేజర్‌గా గడువుతీరినా ఇంకా కొనసాగుతుండటంపై చర్చ జరుగుతోంది. వైకాపా హయాంలో విజయవాడలోని పర్యాటకశాఖలో సహాయ సంచాలకునిగా ఉన్న ఆయన్ని అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సిఫార్సుతో కర్నూలు జిల్లా డీవీఎంగా పోస్టింగు పొందారు. అప్పటి కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, కోడుమూరు ఎమ్మెల్యే జె.సుధాకర్‌ల మద్దతుతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీకి లేఖలు రాయడంతో చంద్రమౌళీరెడ్డిని ఏడాది పాటు డిప్యుటేషన్‌పై పంపించారు. ఈ గడువు తీరినా మళ్లీ వైకాపా పెద్దలతో సిఫార్సు చేయించి మరో ఏడాది డిప్యుటేషన్‌ను పొడిగించారు. అది కూడా ఈనెల 19వ తేదీతో పూర్తయినా ఆయన కొనసాగుతుండటంపై చర్చ జరుగుతోంది.

సిద్ధార్థరెడ్డి సన్నిహితుడికి పదవి....

శాప్ ఛైర్మన్‌గా గతంలో ఉన్న సిద్ధార్థరెడ్డికి, పలువురు వైకాపా నాయకులకు సన్నిహితుడైన పాఠశాల సహాయకుడు శ్రీనాథ్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శిగా ఇటీవలే నియమితులయ్యారు. ఆయన నియామకం విరుద్ధమని స్కూల్ అసిస్టెంట్ శివకుమార్ అప్పటి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తాను అర్హుడినైనా నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగు ఇవ్వడంతో అన్యాయం జరిగిందని పోరాడటంతో శివకుమార్‌ను పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శిగా నియమించారు. శివకుమార్ హయాంలో రాష్ట్రస్థాయిలో 12 బంగారు, ఏడు రజత, 9 కాంస్య పతకాలు వచ్చాయి. గతంలో కాకినాడలో ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో రూ.లక్షల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తగా, మండల క్రీడా సమన్వయకర్తలకు నిధుల పంపిణీలో ఆలస్యం జరిగిందనే కారణం చూపి శివకుమార్‌పై విచారణ జరిపారు. షోకాజ్ నోటీసు ఇవ్వకుండా ఈనెల 17న అర్ధంతరంగా పదవి నుంచి తొలగించారు. ఆయన్ను పక్కన పెట్టి మళ్లీ శ్రీనాథ్‌ను అదేరోజు ఏకపక్షంగా అడ్డగోలుగా నియమించడంపై చర్చ జరుగుతోంది.

రైతుకు నష్టపరిహారం చెల్లించండి

☛ విత్తన సంస్థకు కమిషన్ మొట్టికాయ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నాణ్యత లేని విత్తనాలు విక్రయించిన మహారాష్ట్రకు చెందిన అక్షయ సీడ్స్ సంస్థకు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ మొట్టికాయలు వేసింది. కల్లూరు మండలం తడకనపల్లెకు చెందిన రైతు రమేష్ కర్నూలులోని మహాలక్ష్మి సీడ్స్ దుకాణంలో అక్షయసీడ్స్ క్యాబేజీ రకం విత్తనాలను 2019 మార్చిలో కొనుగోలు చేసి సాగు చేశారు. మంచి దిగుబడులు వస్తాయని విక్రేత చెప్పటంతో రమేష్ వీటిని కొనుగోలు చేశారు. ఆశించిన దిగుబడులు రాకపోవటంతో వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. విత్తనంలో నాణ్యత లేకపోవటంతో దిగుబడి రాలేదని అధికారులు చెప్పటంతో ఆయన కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. విత్తన తయారీ సంస్థ సాంకేతిక లోపం వ్యవహారం గతంలో జాతీయస్థాయి కమిషన్ వరకు వెళ్లింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న కమిషన్ ఛైర్మన్ కరణం కిషోర్‌కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నజీమాకౌసర్‌లు రైతుకు దాదాపు రూ.3 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సంస్థను ఆదేశించారు.

పకడ్బందీగా బీఈడీ పరీక్షలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ చెప్పారు. నగరంలోని పరీక్షా కేంద్రాలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గురువారం మొత్తం 4,768 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 4,359 మంది హాజరైనట్లు చెప్పారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదన్నారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా తదితరులు

25వ తేదీ నుంచి పశుగణన

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించనున్న 21వ అఖిల భారత పశు గణన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ రంజిత్ బాషా గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు ఇంటింటికి వచ్చే విషయ సేకరణదారులకు పశువుల సమగ్ర సమాచారం అందించాలని కోరారు. పశు గణ రంగ పథకాల రూపకల్పనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉల్లాస్‌ంగా.. ఉత్సాహంగా

◆ నిరక్షరాస్యుల్ని అక్షరాస్యులుగా మార్చేందుకు అడుగులు

◆ ప్రాథమిక, డిజిటల్, ఆర్థిక విద్యపై అవగాహనకల్పనకు చర్యలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: 'ఉల్లాస్' (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పేరిట వందశాతం అక్షరాస్యత సాధించి ప్రజల్లో ప్రాథమిక, డిజిటల్, ఆర్థిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55వేల మందికి పైగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నవంబరు 2 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

15 ఏళ్లకుపైగా ఉన్న గ్రామీణవాసుల్ని...

15 ఏళ్లకు పైగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా మార్చడమే 'ఉల్లాస్'లక్ష్యం. ప్రజల జీవన పరిస్థితులు మారిన నేపథ్యంలో ప్రతి అంశంలోనూ సాంకేతికత, డిజిటల్ విధానం, నగదు రహిత లావాదేవీలు, ముఖ్యంగా మహిళలు పొదుపు సంఘాల్లో ఉండేలా చూడటం, బ్యాంకు ఖాతాలు ఉన్న వారికి వాటిని నిర్వహించడం వచ్చేలా అన్ని విషయాలు తెలియజేయడమే లక్ష్యం.. చదువు రాని వారు పక్కవారిపై ఆధారపడుతున్న పరిస్థితులను అధిగమించేలా అందరిలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసేందుకు పూర్తి అవగాహన కల్పిస్తారు. గ్రామాల్లో 15 ఏళ్లు దాటిన వారికి విద్యను అందించే వ్యవస్థ ఏదీ ప్రస్తుతం అందుబాటులో లేదు. అందుకే ప్రత్యామ్నాయంగా మరోమారు గ్రామీణ ప్రాంతాల్లో వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి.



ఉల్లాస్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో ఇలా

అక్షరజ్ఞానం లేని వారిని గుర్తించేందుకు ఏపీ సెర్ప్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. కర్నూలు జిల్లాలో 28,872, నంద్యాల జిల్లాలో 26,785 మంది చదువురాని వారు ఉన్నట్లు గుర్తించారు. వారిలో తొలుత 18వేల మందిని ఎంపిక చేసి వారి వారి గ్రామాల్లోని అంగన్‌వాడీ, కమ్యూనిటీ కేంద్రాల్లో ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటలకు వరకు రెండు గంటల పాటు చదువు చెబుతారు. ఆరునెలల పాటు బోధించి వీరిని అక్షరాస్యులుగా మార్చిన తర్వాత మిగిలిన వారిని రెండు బృందాలుగా విభజించి చెరో ఆరు నెలల పాటు విద్యా బోధన చేస్తారు. 18 నెలల కాలంలో మొత్తం 55 వేల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందించారు.

ఎవరు బోధిస్తారంటే..?

అంగన్‌వాడీ కేంద్రాలే వయోజన విద్యా కేంద్రాలుగా మారుతుండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలే బోధకులుగా మారనున్నారు. వారు అందుబాటులో లేకపోతే పొదుపు సంఘాల్లో, గ్రామంలో చదువుకున్న వారిని వాలంటీర్లుగా నియమిస్తారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను సైతం వాలంటీర్లుగా నియమించే అవకాశాలు ఉన్నాయి. బోధించడం ఒక సేవా కార్యక్రమంగానే భావిస్తుండటంతో వాలంటీర్లకు ఎలాంటి జీతభత్యాలు ఇవ్వడంలేదు. బోధనకు సంబంధించిన విద్యా సామగ్రి త్వరలోనే అందుబాటులోకి రానుంది.

లాభాలు ఇలా...?

ఆర్థిక అక్షరాస్యత లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. విద్య లేకపోవడంతో ఆన్‌లైన్ మోసాలతో ఎక్కువగా నష్టపోతున్న వారిలో నిరక్షరాస్యులే ఎక్కువ. చదువుకోవడం ద్వారా సులభంగా ఆర్థిక లావాదేవీలు, ఇ-వాలెట్లు, ఆన్‌లైన్ చెల్లింపులు, రుణాలకు దరఖాస్తు చేసుకోవడం, వాటిని చెల్లించడం, ఆర్థిక పథకాలపై అవగాహన పెంచుకునేందుకు అవకాశం ఉంటుంది. విషయ పరిజ్ఞానం, సమాచార మార్పిడి, పొదుపు సంఘాల ఆర్థిక నిర్వహణ సులభమవుతుంది.

అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి -ప్రతాప్, ఏపీవో, వయోజన విద్య, కర్నూలు

'ఉల్లాస్' పథకాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించారు. వాలంటీర్లను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వనున్నాం. ఒక్కో వాలంటీరు 10 మందికి చదువు చెబుతారు. ఒక్కో బృందానికి ఆరు నెలల పాటు చదువు చెప్పి అక్షరాస్యులుగా మారుస్తాం.

ఇక్కడి నుంచి కదలం

సీట్లు వదలం

◆ ఏళ్లుగా తిష్టేసిన పీఆర్ ఇంజినీర్లు

◆ వైకాపాకు అనుకూలమైన వారికి మళ్లీ కీలక స్థానాలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పలువురు అధికారులు ఏళ్ల తరబడి ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే తిష్టేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లోనూ చక్రం తిప్పారు. తమకు అవసరమైన ప్రాంతాలను ఎంపిక చేసుకుని నేతల సిఫార్సులతో చేరిపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 95 ఏఈఈ, 12 డీఈఈ, మూడు ఈఈ, రెండు ఎస్ఈ పోస్టులున్నాయి. ఇందులో అధిక శాతం మంది డీఈఈలు, ఏఈఈలు ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి పనిచేస్తున్నారు. సబ్ డివిజన్ పరిధిలో ఒక మండలం నుంచి మరో మండలానికి నేతల ఆశీస్సులతో బదిలీలు చేయించుకుంటూ అక్కడే స్థిరపడిపోవడం గమనార్హం.



ఆ ప్రాంతాలకే పోటీ

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌లో పీఐయూ, పీఆర్ఐ విభాగాలున్నాయి. కేంద్ర ప్రభుత్వం పీఎంజీఎస్‌వై, ఏఐఐబీ కింద పెద్దఎత్తున నిధులు కేటాయిస్తూ ఉంటుంది. ఈ నిధులతో రహదారులు, భారీ వంతెనల నిర్మాణ పనులు పీఐయూ ఆధ్వర్యంలో జరుగుతుంటాయి. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి విడుదలయ్యే నిధులతో రహదారులు, సచివాలయాల నిర్మాణాలు తదితరాలను పీఆర్ఐ విభాగంలో ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో పనులు జరిగే ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు పలువురు పోటీ పడుతూ ఉంటారు.

గత ప్రభుత్వంలో చక్రం తిప్పి..

- పంచాయతీరాజ్ డీఈఈ మహేశ్వరరెడ్డి 2019 నుంచి 2024 వరకు కోడుమూరు పీఆర్ఐ డీఈఈగా పనిచేసి ప్రస్తుతం తిరిగి కోడుమూరు పీఐయూ డీఈఈగా చేరారు. ఆయన గతంలో పదేళ్లపాటు వైద్య, ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్‌పై పనిచేశారు. గతంలో వైకాపాకు అనుకూలంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. అయినప్పటికీ ఆయనకు కోడుమూరు డీఈఈగా బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోనే గత 15 ఏళ్లకు పైగా కొనసాగుతుండటం గమనార్హం.
- డోన్ డీఈఈగా పనిచేసిన నాగిరెడ్డికి తిరిగి కర్నూలులో పోస్టింగ్ ఇచ్చారు. ఆయన ప్రస్తుతం పాణ్యం పీఆర్ఐ డీఈఈగా బాధ్యతలు చేపట్టారు. 2019-24 వరకు అయిదేళ్లపాటు మంత్రి ఇలాకాలో రూ.కోట్ల విలువైన పనులు జరిగాయి. వైకాపా వ్యక్తిగా ముద్ర వేసుకున్న డీఈఈకి మళ్లీ కర్నూలులో ఎలా పోస్టింగ్ ఇచ్చారన్న విషయమై చర్చ సాగుతోంది.

అక్కడికక్కడే బదిలీలు చేయించుకుంటూ..

- పత్తికొండ డీఈఈ శేషయ్య ఏఈఈ స్థాయి నుంచి జిల్లాలో 16 ఏళ్లగా కొనసాగుతున్నారు. డోన్‌లో విధులు నిర్వహించి డీఈఈగా పదోన్నతి పొంది ఆరేళ్లు అక్కడే పనిచేశారు. ఎన్నికల ముందు మొక్కుబడిగా మరో జిల్లాలో విజిలెన్స్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తిరిగి పత్తికొండ వచ్చారు.
- పీఆర్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఈరన్న ఆరేళ్లుగా ఆదోని (కర్నూలు కేంద్రంగా)లో పనిచేస్తున్నారు. ఆయన గతంలో కర్నూలు డ్వామాలో అదనపు పీడీగా పనిచేసి క్వాలిటీ కంట్రోల్‌కు వచ్చి స్థిరపడిపోయారు. నిబంధనల మేరకు క్వాలిటీ కంట్రోల్‌లో మూడేళ్ల సర్వీసు దాటితే బదిలీ చేయాల్సి ఉంది. కానీ పీఆర్ ఇంజినీర్ల సంఘం పేరుతో ఇక్కడే కొనసాగుతున్నారు.
- పీఆర్‌లో మరో ఇద్దరు ఏఈఈలు కీలకంగా వ్యవహరిస్తూ చక్రం తిప్పుతున్నారు.. మొన్నటివరకు కర్నూలు ఏఈఈగా ఉన్న రవిమోహన్‌రెడ్డి ఇటీవల జరిగిన బదిలీల్లో కల్లూరుకు బదిలీ అయ్యారు. ఆయన జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ కావడం లేదు. కర్నూలు, కల్లూరు మండలాల్లోనే 20 ఏళ్లగా కొనసాగుతున్నారు.
- ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తూ పీఆర్‌కు బదిలీ అయిన ఏఈఈ ముక్తార్‌బాషా గత 22 ఏళ్లుగా కర్నూలులో తిష్టేశారు. అసోసియేషన్ పేరుతో కొందరు ఇంజినీర్ల బదిలీల్లో జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.
- మంత్రాలయం డీఈఈ అశ్వర్థామ గత 15 ఏళ్లుగా మంత్రాలయం, ఆదోని సబ్ డివిజన్లకే పరిమితమయ్యారు. జిల్లాను విడిచి వెళ్లడం లేదు. మరో డీఈఈ రంగస్వామి సైతం ఆదోని, మంత్రాలయంలోనే ప్రాంతాల్లోనే ఉంటున్నారు.
- నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న డీఈఈలు నాగశ్రీనివాసులు, మన్మథబాబు, మురహరి గత 25 ఏళ్లుగ్గా అక్కడికక్కడే బదిలీలు చేయించుకుంటూ కొనసాగుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలతో పైరవీలు చేయించుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

అంటకాగిన వారికే అందలం

◆ డీఈవో కార్యాలయంలో వైకాపా అనుకూల అధికారుల హవా ◆ ఇన్‌ఛార్జి డీఈవోగా శామ్యూల్‌పాల్

ఈనాడు, కర్నూలు : వైకాపా పాలనలో ఆ పార్టీ నాయకులతో అంటకాగినవారే 'కూటమి' ప్రభుత్వంలోనూ రాజ్యమేలుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా వైకాపా హయాంలో నియమితులైన శామ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం గురువారం బదిలీ చేసింది. తమకు రిపోర్టు చేయాలని ఆదేశించింది. వైకాపా నాయకులకు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన ఆయన తన పలుకుబడి ఉపయోగించి రాయలసీమ జిల్లాల ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా (ఆర్‌జేడీ), సమగ్రశిక్షా ఏపీసీగా ఇన్‌ఛార్జిగా కొనసాగారు. ఆయన హయాంలో కేజీబీవీల్లో సీట్ల కేటాయింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా ప్రతిభావంతులైన పలువురు విద్యార్థులకు సీట్లు దక్కలేదన్న విమర్శలున్నాయి. తాజాగా కేజీబీవీల్లో ఒప్పంద బోధన సిబ్బంది పోస్టుల భర్తీకి తొలి ప్రకటనలో కొన్ని పోస్టులిచ్చి ఆ తర్వాత కొన్ని పోస్టులను రద్దు చేయడం వివాదాస్పదంగా మారింది. ఒక గణితం, రెండు సోషల్ పోస్టులకు వందలాది దరఖాస్తులు చేసుకున్న అనంతరం ఆయా పోస్టులు లేవని ప్రకటించడంతో అభ్యర్థులు ఆందోళన చేసేందుకు సిద్ధమవుతున్నారు.



డీఈవో కార్యాలయం

అడ్డగోలుగా తప్పించారు..

సమగ్రశిక్షా ఏపీసీగా ఈ ఏడాది జనవరి 17న బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ విజయజ్యోతి కుమారి జూన్ 24వ తేదీన బదిలీ అయ్యారు. జిల్లాలో కీలక పోస్టు కావడంతో ఆమె సేవలు కొనసాగించాలంటూ అప్పటి కలెక్టర్ సృజన ప్రభుత్వానికి సైతం లేఖ రాశారు. కలెక్టర్ బదిలీపై వెళ్లేరోజు ఏపీసీ బదిలీకి సంబంధించిన ఫైల్ ఆమె ముందు పెట్టి హడావుడిగా సంతకం చేయించుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఆమె రిలీవింగ్ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. జూన్ 25వ తేదీన ఆమె కార్యాలయానికి తాళం వేయించగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఫలితంగా బాధ్యతల అప్పగింత ప్రక్రియ నేటికీ పూర్తి కాలేదు.

ఆరోపణలున్న అధికారికే బాధ్యతలు

డీఈవో కార్యాలయంలోనే సహాయ సంచాలకులుగా ఉన్న శామ్యూల్‌పాల్‌ను ఇన్‌ఛార్జి డీఈవోగా నియమించడం చర్చనీయాంశంగా మారింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో వైకాపా అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డిని గెలిపించేందుకు ఆయన విశ్వప్రయత్నాలు చేశారన్న ఆరోపణలున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో దొంగ ఓట్లు నమోదు చేయించారని, అటెండర్లను ఉపాధ్యాయులుగా చూపారని.. వైకాపా అభ్యర్థికి ఓట్లు వేయించకపోతే గుర్తింపు రద్దు చేయిస్తానంటూ కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను బెదిరించినట్లు విమర్శలొచ్చాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన ఆదిమూలం సురేశ్‌కు శామ్యూల్‌పాల్ బంధువని, ఆయన సిఫార్సుతోనే పోస్టింగు పొందారన్న ప్రచారం ఉంది. ఆయా ఆరోపణలను పలువురు తెదేపా నాయకులు పార్టీ దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఆయన తన ఇంటిని అనధికారికంగా వైకాపా కార్యాలయంగా మార్చేశారంటూ తెదేపా నాయకులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారంటే ఆయనపై ఉన్న ఆరోపణల తీవ్రత అర్థం చేసుకోవచ్చు. కోడుమూరు అభ్యర్థిగా వైకాపా తరపున పోటీ చేసిన ఆదిమూలపు సతీశ్‌కు అనుకూలంగా ప్రచారం చేశారని తెదేపా నాయకులు ఆరోపిస్తున్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కూడా వారు లేఖలు రాశారు. అయినప్పటికీ రాష్ట్రస్థాయి విద్యాశాఖ ఉన్నతాధికారులు శామ్యూల్‌పాల్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

బంధువుకు కీలక పదవి

■ శామ్యూల్‌పాల్ తన బంధువైన ఉపాధ్యాయురాలు స్నేహలతను సమగ్రశిక్షా విభాగంలో జీసీడీవో పోస్టులో జులై నెలలో నియమించారన్న విమర్శలున్నాయి. ఆమె గతంలో సుమారు ఐదేళ్లపాటు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డి.సి.బి.)లో కూడా డిప్యుటేషన్‌పై కొనసాగారు. ఆదోని పురపాలక పాఠశాలలో ఉపాధ్యాయురాలైన ఆమె ఇతర పోస్టుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

■ శామ్యూల్‌పాల్‌కు సన్నిహితుడైన నాగరాజు డి.సి.బి. కార్యదర్శిగా ఏడేళ్ల కిందట నియమితులయ్యారు. వైకాపా అనుకూల వ్యక్తి కావడంతో మూడేళ్ల పదవీ కాలం తర్వాతా కొనసాగారు. దీంతోపాటు గత సంవత్సరం ఆయన గూడూరు ఎంఈవో-2గా కూడా పోస్టింగు పొందారు. నిబంధనల ప్రకారం రెండింటిలో ఒక పోస్టులో మాత్రమే కొనసాగాల్సి ఉండగా ఉన్నతాధికారుల అండతో జోడు పదవుల్లో కొనసాగుతున్నారు.

పోస్టింగుల పేరుతో భారీ వసూళ్లు

జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌తో సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు తెచ్చుకుని తమకు కావాల్సిన చోట పోస్టింగులు పొందారు. వారు కోరుకున్న ప్రాంతాన్ని బట్టి ఒక్కొక్కరి బదిలీకి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు కొందరు వసూలు చేశారు. సుమారు 250 మంది నుంచి భారీఎత్తున వసూలుచేసి వారికి పోస్టింగుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఒక్క బదిలీల అంశంలోనే రూ.10 కోట్ల వరకు వసూలు చేశారన్న విమర్శలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా భారీ కుంభకోణం జరగడంతో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొన్ని బదిలీలను ఆపేసింది. బదిలీలు జరగని వారు తమ డబ్బులు ఇవ్వాలని కోరితే తీవ్ర బెదిరింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. కాగా దళారుల అవతారమెత్తి పోస్టింగులు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిందెవరో తేల్చాలని పలువురు డిమాండు చేస్తున్నారు.

వసతిగృహం తనిఖీ చేసిన పత్తికొండ సివిల్ జడ్జి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్ల, దేవనకొండ మండలంలోని తెర్నెకల్ బాలబాలికల వసతి గృహాలను గురువారం రాత్రి పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి తనిఖీ చేశారు. గోనెగండ్లలోని బాలికల బీసీ వసతి గృహాన్ని ఆమె సీఐ గంగాధర్‌తో కలిసి తనిఖీ చేశారు. బాలికల గదులు, వంటగది, తయారు చేసిన భోజనం, మరుగుదొడ్లు పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మధ్యాహ్నం పాఠశాలలో ఉడకని అన్నం పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో పత్తి కోర్టు సిబ్బంది రాఘవేంద్ర, మంజుల, వార్డెన్ సుజాత, పోలీసులు బ్రహ్మయ్య, నాయక్, రమేశ్ పాల్గొన్నారు.



గోనెగండ్లలో వసతి గృహ బాలికలతో మాట్లాడుతున్న పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్.భారతి

నాణ్యతలో రాజీపడొద్దు

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ఉపాధి నిధులతో చేపడుతున్న పనులకు సంబంధించి నాణ్యతో ఏమాత్రం రాజీపడకుండా చూడాలని పంచాయతీరాజ్ కర్నూలు ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి ఆదేశించారు. కర్నూలు డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులకు జడ్పీలోని సమావేశ మందిరంలో ఉపాధి పనుల నిర్వహణ, నాణ్యతపై తీసుకోవాల్సిన అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పనులు మొక్కుబడిగా నిర్వహిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పంచాయతీ పాలకవర్గం, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజల సమన్వయంతో పనులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. కర్నూలు డివిజన్ ఈఈ మద్దన్న, పీఆర్ నాణ్యత విభాగం కర్నూలు డీఈఈ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పనులపై నిత్యం నిఘా ఉంటుందని, జాగ్రత్తగా వ్యవహరించాల్సిన బాధ్యత ఇంజినీర్లపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగిరెడ్డి, మహేశ్వరరెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, హెచ్.ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి

వాహనం చెట్టుకు ఢీకొని ఇద్దరి దుర్మరణం

పెంచికల పాడు (గూడూరు) న్యూస్‌టుడే: కర్నూలు- బళ్లారి రహదారిలోని పెంచికలపాడు సమీపంలో ట్రాలీ ఆటో చెట్టును ఢీకొంది. గురప్ప, రామయ్య అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటప్ప తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం జరిగింది. కె.నాగలాపురం ఎస్సై ఆశాలత తెలిపిన వివరాల మేరకు.. మైదుకూరుకు చెందిన రామయ్య, వెంకటప్ప పందుల వ్యాపారం చేస్తుంటారు. ఇందులో భాగంగానే ఎమ్మిగనూరు నుంచి బెంగళూరుకు పందులను ట్రాలీ ఆటోలో తరలిస్తున్నారు. వాహనం చెట్టును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందారు. గురప్ప వివరాలపై ఆరా తీస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పందులను కొనుగోలు చేశారా? దొంగిలించి తరలిస్తున్నారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దకడబూరు, మంత్రాలయం, న్యూస్‌టుడే: మండలంలోని ఓంనగర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయపడినట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... మంత్రాలయం గ్రామానికి చెందిన మదీనాబీ కుమారుడి పెళ్లి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో ఆదోని పట్టణంలో షాపింగ్ చేయడానికి వెళ్లారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఓంనగర్ వద్ద ఎదురుగా అతివేగంతో వస్తున్న లారీని తప్పించబోయి పక్కనున్న మట్టికుప్ప పైకి దూసుకెళ్లి ఆటో బోల్తా పడిందన్నారు. ఈ ప్రమాదంలో మదీనాబీ అన్న ముల్లాఖాజాహుసేన్ (54) తలకు బలమైన గాయం కావడంతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మదీనాబీతోపాటు కుటుంబ సభ్యులైన ఖాజా బందే నవాజ్, రషీదాకు గాయాలైనట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



మృతి చెందిన ఖాజా ఉసేన్ (పాత చిత్రం)

బెంగ తీర్చిన తుంగభద్ర

◆ దిగువ కాల్వలో నీటి గలగలలు

◆ రబీ సాగులో అన్నదాతలు

ఆలూరు గ్రామీణ, హాలహర్వి, న్యూస్‌టుడే: తుంగభద్ర ప్రాజెక్టులో గత ఐదేళ్లలో ఎప్పుడులేని విధంగా ఈ ఏడాది నీరు పుష్కలంగా ఉంది. ప్రాజెక్టు ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది. దీంతో ప్రస్తుతం 101 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం రోజు 52 వేల క్యూసెక్కుల నుంచి లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నిండుగా ఉండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా నదికి విడుదల చేస్తున్నారు. ఎప్పుడు లేనంతగా నీరు వస్తుండటంతో ఏడాది రబీకి సైతం పుష్కలంగా వరకు నీరు అందుతుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దిగువకాల్వ నిండుగా వస్తున్న నీరు

పదేళ్లలో ఇదే అధికం

తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలో ఈ ఏడాది వర్షాలు భారీగా కురవడంతో గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ప్రాజెక్టులో నీరుంది. గతంతో పోలిస్తే.. 81 శాతం మేర నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఏటా ఖరీఫ్ పంటకు పుష్కలంగా నీరు అందిస్తున్న బోర్డు అధికారులు... రబీలో మాత్రం మధ్యలోనే కాల్వకు నీటిని నిలిపేయడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దిగువ కాల్వ కింద రబీలో 1.10 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది సైతం ఖరీఫ్ సాగుచేసిన పంటలకు మొదట్లో చివరి ఆయకట్టుకు నీరు అందేదికాదు. ఇటీవల కురిసిన వర్షాలతో ఈ ఏడాది చివరి ఆయకట్టుకు సైతం నీరు అందుతుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న ప్రవాహం

ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రానికి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. దీంతో బోర్డు అధికారులు నదికి సైతం అవుట్‌ఫ్లోను పెంచుతున్నారు. 22వ తేదీన ఉదయం ప్రాజెక్టుకు 52,001 క్యూసెక్కులు వెళ్లగా.. మధ్యాహ్నం 98,718 క్యూసెక్కులు రాగా సాయంత్రానికి 1,12,136 క్యూసెక్కులు నీరు వస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో అధికారులు 23 గేట్లు తెరచి నీరు నదిలోకి వదులుతున్నారు.

నిండుగా ప్రవహిస్తున్న కాల్వ - పడదయ్యస్వామి, జే.హొసళ్లి



ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు ఉండటం, కాల్వలో ప్రవాహం పుష్కలంగా ఉంది. గతంలో ఈ సమయంలో ఇంత నిండుగా ప్రవహించిన దాఖలాలు లేవు. వర్షాలు ఎక్కువ కావడంతో పంటలకు నీటి అవసరం తగ్గింది. దీంతో కాల్వ నిండుగా ఉంది. చివరి ఆయకట్టు రైతులకు ఈ ఏడాది నీరు పుష్కలంగా అందుతోంది.

ఎప్పుడూ చూడలేదు - తిక్కన్న, సమ్మతగేరి



దిగువ కాల్వ పరిధిలోని 51 డీపీ కింద నాకు ఆరు ఎకరాల భూమి ఉంది. దీంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశా. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది నీరు పుష్కలంగా కాల్వకు వస్తోంది. ప్రాజెక్టులోనూ నీరు ఉండటంతో పాటు, కాల్వకు నీరు అంతేస్థాయిలో ఇవ్వడంతో రబీ చివరి వరకు నీరు అందుతుంది. చాలా ఆనందంగా ఉంది.

ఆదోని
●ఆదోని ●ఆలూరు ●పత్తికొండ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఆదోని తాలుకా సీఐ నల్లప్ప

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆదోని తాలుకా సీఐ నల్లప్ప అన్నారు. ఆదోని మండలం పెద్దతుంబళం జడ్పీ పాఠశాలలో గురువారం రహదారి భద్రత, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద తుంబళం ఎస్సై మహేష్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విద్యార్థులతో పాటు, ఆటో డ్రైవర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వివరిస్తేనే ఫలితం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయం విద్యార్థులకు క్షేత్రస్థాయిలో వివరిస్తేనే పూర్తిస్థాయిలో అవగాహన కలుగుతుందని వ్యవసాయ ఒకేషనల్ అధికారిణి ప్రియాంక, వీహెచ్‌వీ అన్నప్ప అన్నారు. ఆలూరులోని కస్తూర్బా విద్యార్థులకు పెడ్‌లో గురువారం అవగాహన కల్పించారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా ఆలూరులోని నర్సరీ పామెలను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో కస్తూర్బా ఎస్‌ఓ సుహాసిని, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో అధికారిణి ప్రియాంక, వీహెచ్‌వీ అన్నప్ప

అవస్థలు చూసైనా.. చలించరు!

- విద్యార్థులకు అందని దుప్పట్లు
- వసతిగృహాల్లో అసౌకర్యాలు

ఇరుకు గదులు.. తలుపులు లేని కిటికీలు.. రాత్రైతే చాలు చల్లని గాలులు శరీరాన్ని కలవరపెడుతున్నాయి.. చిన్నారులు తట్టుకోలేక వణికిపోతున్నారు. గదిలో ఏ మూలకు నక్కినా.. అంతే. ఉన్నగదులు చాలక సమీపంలోని పాఠశాలల గదుల్లో నిద్రించాల్సిన పరిస్థితి. చలికాలం మొదలైంది.. గత ఏడాది సైతం దుప్పట్లు అందకపోవడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. కొందరు ఇంటి నుంచి తెచ్చుకున్న వాటితో సర్దుకుపోతున్నారు. మరికొందరు చేసేది లేక కాళ్లుముడుచుకుని నిద్రపోతున్నారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని వసతిగృహాలను 'న్యూస్‌టుడే' పరిశీలించింది.

మండలం: | పరిశీలించిన వసతిగృహం: | మొత్తం విద్యార్థులు | ఉంటున్నవారు:

ఇరుకు గదుల్లో ఇబ్బందులు



ఆదోని | ఎస్సీ బాలుర వసతిగృహం | 95 | 77

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 95 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉన్న ఐదు గదుల్లోనే నిద్రించక తప్పడం లేదు. గదులు ఇరుకుగా మారడంతో.. ఆవరణలో కొందరు, ఆఫీసు రూమ్‌లో మరికొందరు పడుకోవాల్సి వస్తోంది. వర్షం వస్తే జాగరణే. ఈ ఏడాది నూతనంగా 45 మంది విద్యార్థులు వసతిగృహంలో చేరగా.. వీరికి ఇంతవరకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. ఫలితంగా కొందరు విద్యార్థులు దుప్పట్లు లేక వసతిగృహం ఆవరణలో అలాగే చలికి పడుకుంటున్నారు. మరికొందరు గదిలో ఓ వైపు ట్రంకు పెట్టెలు పెట్టుకుని, మధ్యలో ఇరుకుగా పడుకుంటున్నారు. స్నానపుగదులు లేకపోవడంతో భవనం వెనుకభాగంలో ఆవరణలో ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. మరుగుదొడ్లు సైతం శిథిలావస్థకు చేరాయి.

ఆవరణలోనే స్నానాలు చేస్తున్నాం

– రామాంజనేయులు, పెసలబండ (ఆదోని)



ఆదోని ఎస్సీ బాలుర వసతిగృహంలో స్నానాల గదులు లేక వసతిగృహం వెనుకభాగంలో ఉన్న కుళాయిల వద్ద స్నానం చేస్తున్నాం. బాత్‌రూమ్‌లు కొత్తవి నిర్మిస్తే బాగుంటుంది. ఈ ఏడాది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నాం.

దుప్పట్లు ఇవ్వలేదు – అశోక్, పదో తరగతి, మండిగిరి



ఈ ఏడాది దుప్పట్లు ఇవ్వలేదు. ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి పూట చలి, దోమలతో నిద్రపోవడం కష్టంగా ఉంటోంది. ప్లేట్లు కూడా పంపిణీ చేయలేదు. వసతిగృహ భవనం మొత్తం దెబ్బతింది. రాత్రి పూట పడుకోవడం ఇబ్బందిగా ఉంది. రేకుల షెడ్డు, ప్రక్కన్న ఉన్న ప్రభుత్వ పాఠశాలలో రాత్రి పూట పడుకుంటున్నాం. సమస్యలు పరిష్కరించాలి.


ఎస్సీ బాలుర వసతి గృహంలో దుప్పట్లు లేక ఇలా విద్యార్థులు

పత్తికొండ గ్రామీణం, పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: ఇక్కడ గత ఏడాది పంపిణీ చేసిన దుప్పట్లు తప్ప ఈ ఏడాది ఒక్కరికి కూడా దుప్పట్లు ఇవ్వలేదు. ఇద్దరు ముగ్గురు కలిసి పడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలులో దుప్పట్లు తీసుకొచ్చేందుకు సిబ్బంది దిని పంపనున్నట్లు వస్పతిగృహ అధికారి వెల్లడించారు.

పత్తికొండ | ఎస్సీ బాలుర వసతి గృహం | 108 | 101

ఈ ఏడాది ఇంత వరకు ఎవరికీ దుప్పట్లు పంపిణీ చేయలేదు. విద్యార్థులు ఇబ్బందులు



పత్తికొండ | సమీకృత సంక్షేమ వసతిగృహం | 390 | 340

సమీకృత వసతి భవనంలో కనీసం కింద పర్చుకునేందుకు లేక

పెచ్చులూడిపడుతున్నా..



హొళగుంద | బీసీ బాలుర వసతిగృహం | 143 | 143

హొళగుంద, న్యూస్‌టుడే: ఇంగళదహాళ్ గ్రామంలోని బీసీ బాలుర వసతిగృహ భవనం కాన్క్రీట్‌తో 12 గదులతో నిర్మించారు. రెండు గదుల పైకప్పు పూర్తిగా పెచ్చులూడి కడ్డీలు బయటపడ్డాయి. వాటిని ఉపయోగించడం లేదు. ఇతర గదుల గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. గదులు చాలక పోవడంతో ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన రెండు గదులను వినియోగించుకుంటున్నారు. పాత దుప్పట్లనే వాడుతున్నారు. సుమారు పది సంవత్సరాలైనా కంచెలు, గ్లాసు, పెట్టెలు ఇవ్వలేదు. 12 మరుగుదొడ్లకు గాను రెండు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి, స్నానపు గదులకు తలుపులు లేవు. మరికొన్ని శిథిలావస్థకు చేరాయి. వసతిగృహం మరమ్మతులకు రూ.68లక్షలు అవసరమని అధికారులు అంచనా వేశారు.

తాగునీటికి ఇక్కట్లు

– హేమంత్‌కుమార్, పదో తరగతి, ఆస్పరి



పాత దుప్పట్లతోనే కాలం గడుపుతున్నాం. కొత్తగా చేరిన విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకున్న వాటిని కప్పుకొంటున్నారు. మా వసతిగృహంలో శుద్ధజలం రావడం లేదు. కుళాయి నీరే తాగుతున్నాం. మా వసతిగృహంలోని ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతు చేయిస్తే.. తాగునీరు అందుబాటులో ఉంటుంది.

దోమల బెడద తప్పటం లేదు

– వీరేష్, పదో తరగతి, ఆస్పరి



మా వసతిగృహంలోని హాల్‌లోనే విద్యార్థులమంతా నిద్రిస్తాం. హాల్‌లోని చాలా కిటికీలకు తలుపులు లేవు దీంతో దోమలు, చల్ల గాలితో ఇబ్బందులు పడుతున్నాం. దీంతో రోగాల వ్యాపిస్తున్నాయి. ప్రభుత్వం దుప్పట్లు ఇవ్వడంతో పాటు కిటికీలకు తలుపులు ఏర్పాటు చేయాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

బొంతలే దిక్కు



ఆలూరు | సమీకృత బాలుర వసతిగృహం | 246 | 204

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలూరులోని సమీకృత బాలుర వసతిగృహంలో ఈ ఏడాది విద్యార్థులకు దుప్పట్లు అందలేదు. దీంతో ఇళ్ల నుంచి బొంతలు, దుప్పట్లు తెచ్చుకుని వాటిని కప్పుకొంటున్నారు. గతంలో ఇచ్చినవి కొన్ని చిరిగిపోవడంతో ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. వసతిగృహం మొత్తం కిటికీలు బాగానే ఉన్నాయి. వెంటిలేటర్ నుంచి చల్ల గాలులు వీస్తుండటంతో వాటికి ప్లాస్టిక్ సంచులను అడ్డుగా కట్టుకున్నారు.

ఆరుబయటే స్నానం



తుగ్గలి | గురుకుల పాఠశాల, రాతన | 130 | 115

తుగ్గలి, న్యూస్‌టుడే: రాతన గ్రామ సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు స్నానపు గదులు లేక ఆరుబయట స్నానం చేస్తున్నారు. గురుకుల పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో బాలికల ఆశ్రమ పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. నాడు-నేడు పథకం కింద చేపట్టిన స్నానం గదులు, మరుగుదొడ్ల నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. చలి కాలంలోనూ విద్యార్థులు నీటి ట్యాంకు వద్ద ఆరుబయటే స్నానం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఐక్యరాజ్యసమితి కృషి అభినందనీయం

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ప్రపంచ శాంతి కోసం ఐక్యరాజ్యసమితి చేస్తున్న కృషి అభినందనీయమని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్ అన్నారు. కళాశాలలో రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఐక్యరాజ్య సమితి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగ అధికాకి డాక్టరు అయ్యప్ప, వైస్ ప్రిన్సిపల్ బాలస్వామి, రామకృష్ణ, వెంకటరామిరెడ్డి, గోవిందు, యల్లప్ప, గోపాల్‌రెడ్డి, విరుపాక్షి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

ఆస్పరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని శిక్షణ డీఎస్పీ ఉషశ్రీ, ఆస్పరి సీఐ మస్తాన్‌వలీ అన్నారు. ఆస్పరి పోలీసు స్టేషన్‌లో వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రాణేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్య ఉంటే తెలపండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సమస్యలపై వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదోని మండల గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ మధుకృష్ణ ఆచారి అన్నారు. ఆదోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈవోఆర్‌డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధార్‌లో తప్పులు సవరించుకోండి

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆధార్ కార్డులో తప్పులుంటే శిబిరాలకు వచ్చి సరిచేసుకోవాలని ఎంపీడీవో గీతావాణి తెలిపారు. ఆస్పరిలోని సచివాలయంలో ఆధార్ శిబిరాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ శిబిరం 25వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

ఆటస్థలం కేటాయించాలని వినతి

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు ఆట స్థలం లేదని, కేటాయించాలని ఎంఈవో రమేష్, ప్రధానోపాధ్యాయిని భ్రమరాంబ ఆర్డీవో భరత్ నాయక్‌ను కోరారు. ఆయనను గురువారం కలిసి వినతి పత్రం సమర్పించారు. 1059 మంది విద్యార్థినులు ఉన్నారని తెలిపారు.

వ్యాసరచన పోటీలతో మెదడుకు పదును




ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న పాఠశాల నిర్వాహకులు

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల మెదడును పదును చేస్తాయని నేషనల్ పాఠశాల కరస్పాండెంట్ జి.గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. ఆదోని పట్టణంలోని నేషనల్ ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై 8, 9, పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన బి.రిత్వికసాయి, ద్వితీయ స్థానంలో కె.వెన్నెల, తృతీయ బహుమతిని జి.సింధూర అనే విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ సత్యశ్రీ, జీకే ఇన్‌ఛార్జీ ఇజ్రాయిల్, విజయ్‌కుమార్, అబ్దుల్లా, రవి, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం పురస్కరించుకుని ఆదోని పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు జీవన్‌సింగ్, శ్రీధర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ప్రశాంత్‌గాంధీ, సోమశేఖర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, రాచోటి సుబ్బయ్య, విట్టా రాజేష్, పద్మనాభయ్య, హుసేన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పల్లెల్లో జ్వరాల కలవరం

- ఆసుపత్రిపాలవుతున్న చిన్నారులు
- మంచం పట్టిన గ్రామాలు

పత్తికొండ పట్టణం, హొళగుంద, దేవనకొండ, న్యూస్‌టుడే: గ్రామాల్లో రోజురోజుకు జ్వర బాధితులు పెరిపోతున్నారు. ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. తరుచూ డెంగీ, మలేరియా కేసులు నమోదవుతున్నాయి. హొళగుంద మండలం నెరణికి గ్రామంలో గ్రామస్థులు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. కాల్వలు శుభ్రం చేయడం లేదు. దోమలు వ్యాప్తి చెందడంతో జ్వరాలు సోకుతున్నాయి. గ్రామంలోని బస్టాండు కాలనీకి చెందిన యువకుడు కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. ఆదోని ఏరియా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించారు. డెంగీగా నిర్ధారణ అయింది. అదే గ్రామానికి చెందిన ఆరేళ్ల దివ్యశ్రీ, రెండేళ్ల హిమవర్షిణి టైఫాయిడ్ బారిన పడ్డారు. గ్రామంలో జ్వరాలతో పలువురు మంచాన పడ్డారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ఆదోని ఏరియా ఆసుపత్రిలో జ్వర బాధితులు


చికిత్స పొందుతున్న దివ్యశ్రీ

అధికారుల పరుగులు

☛ పత్తికొండ పట్టణంలోని మడ్డిగేరి కాలనీలో బాలింతకు గన్యా జ్వరం సోకింది. జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు కాలనీలో పర్యటించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

☛ దేవనకొండలో నాలుగేళ్ల బాలుడు డెంగీ బారిన పడ్డాడు. మండల వైద్యాధికారి కల్యాణ్ చక్రవర్తి, మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా మండలంలో పర్యటించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మురుగు కాలువలను శుభ్రం చేయించాలని, రహదారులపై మురుగు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. ప్రజలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

☛ మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఒకరికి డెంగీ సోకింది. అధికారుల బృందం పర్యటించింది. వైద్యాధికారులు అరుణజ్యోతి, వెంకటేశ్వర్లు, మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. మురుగు కాలువలు శుభ్రం చేయించాలని, రహదారులపై మురుగు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. జ్వర లక్షణాలు ఉంటే.. పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి – నూకరాజు, జిల్లా మలేరియా నివారణ అధికారి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లో తరుచూ పర్యటిస్తూ.. ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటున్నాం. డెంగీ, మలేరియా, గన్యా లక్షణాలు గుర్తించి పరీక్షలు చేయించుకోవాలి. దోమలు పెరగకుండా, నీటి నిల్వలు లేకుండా, టైర్లు, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ వస్తువులు లేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా బాలింతలు తినే ఆహారం తాగునీరు కలుషితం కాకుండా వేడి చేసుకొని తాగాలి. జాగ్రత్తలు పాటించాలి.

బ్రాహ్మణుల హర్షం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆలయాల పాలకమండళ్ల కమిటీలలో ఇద్దరు చొప్పున బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించడం హర్షించదగ్గ విషయమని 37వ వార్డు కౌన్సిలరు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకురాలు వెల్లాల లలితమ్మ మధుసూదన్‌శర్మ తెలిపారు.

సమాచారం లేకుండా గ్రామసభలా?

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామంలో భూ రీసర్వేపై గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సభలో తహసీల్దారు నజ్మిబాను, ఉప తహసీల్దార్ బ్రహ్మయ్య, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామసభ నిర్వహణపై స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం లేకుండానే నిర్వహించారు. సమాచారం ఇవ్వని ఇలాంటి వీఆర్‌వో తమకు వద్దని అధికారులకు విన్నవించారు. దీనిపై తహసీల్దారు, ఉప తహసీల్దారు స్పందిస్తూ ఇకపై తప్పనిసరిగా ప్రజాప్రతినిధులకు సమాచారం అందిస్తామని హామీ ఇచ్చారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

హొళగుంద, న్యూస్‌టుడే: ఆదోని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం హొళగుంద నుంచి ఆదోనికి వెళ్తుండగా. . హొళగుంద శివారులో నిలిచిపోయింది. బస్సు బ్యాటరీ వైర్లు కాలిపోవడంతో, ముందుకు వెళ్లలేక మొరాయించింది. సుమారు 35 మంది ప్రయాణికులు మరో బస్సులో వెళ్లిపోయారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

ఆస్పరి, న్యూస్‌టుడే: సమస్య: బనవనూరు గ్రామానికి సరైన రహదారి లేదు. బైలుప్పల నుంచి బనవనూరు వరకు తారు రహదారి గుంతలు పడి అధ్వానంగా ఉంది. రహదారికి మరమ్మతులు చేయాలి.

- హనుమంతరెడ్డి, బనవనూరు

సమాధానం: రహదారిని పరిశీలిస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ, ఆస్పరి**

కటారుకొండ (కృష్ణగిరి), న్యూస్‌టుడే: సమస్య: కటారుకొండ గ్రామంలో సుంకులమ్మ దేవాలయం సమీపంలో పెద్దొడ్డి గ్రామానికి వెళ్లేదారిలో మురుగు కాల్వలు, రోడ్డు సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు ముందుకు పారడం లేదు. సీసీ రహదారి, మురుగు కాల్వలు నిర్మించాలి. **- వెంకటేశ్వర్లు, కటారుకొండ**

సమాధానం: మురుగు కాల్వ, సీసీ రహదారి లేక ఈ సమస్య తలెత్తుతోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- లెనిన్‌బాబు, సర్పంచి, కటారుకొండ

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. విద్యార్థులు మరుగదొడ్లకు, మూత్రశాలలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

- విద్యార్థులు, డిగ్రీ కళాశాల

సమాధానం: వర్షాకాలం కావడంతో మొక్కలు పెరుగుతున్నాయి. తరుచూ శుభ్రం చేస్తూనే ఉన్నాం. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కలు తొలగిస్తాం.

- మాధురి, ప్రిన్సిపల్, డిగ్రీ కళాశాల, పత్తికొండ

ఆలూరు, న్యూస్‌టుడే: సమస్య: ఆలూరులోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలోని హొళగుంద వెళ్లే మార్గంలో కాల్వలో చెత్తాచెదారం పేరుకుపోయింది.

- రామాంజి, ఆలూరు

సమాధానం: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాల్వను శుభ్రం చేయిస్తాం.

- అరుణాదేవి, సర్పంచి, ఆలూరు

యురేనియం తవ్వకాలు అడ్డుకుంటాం

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలు చేపడితే అడ్డుకుంటామని కొండ చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు హెచ్చరించారు. కప్పట్రాళ్ల, చెల్లెల చెలిమిల, గ్రామ సర్పంచులు చెన్నమనాయుడు, మహేశ్వరరెడ్డి, తెదేపా నాయకులు మలికార్జున, మల్లేపల్లి రంగడు ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో ఆయా గ్రామస్థులతో గురువారం సమావేశం నిర్వహించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. జల వనరుల శాఖ నుంచి 68 బోర్ల తవ్వకాలు తవ్వేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిసిందని, గ్రామాలకు నష్టం కలిగేలా తవ్వకాలు చేపడితే దీనిపై భారీ ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు హనమంతరెడ్డి, ముచ్చు రామచంద్రుడు, సూరి, తదితరులు పాల్గొన్నారు.


చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో నిరసన తెలుపుతున్న పలు గ్రామాల ప్రజలు

అయ్యో.. మర్చిపోయారేమో!

ఆలూరు ప్రధాన బజారులో వాల్వ్ గుంత ప్రమాదకరంగా మారింది. మరమ్మతు కోసం పది రోజుల కిందట గుంత తవ్వారు. తరువాత గుంతను పూడ్చక అలాగే వదిలేశారు. ప్రధాన బజారుకు పట్టణ వాసులతో పాటు నిత్యం పలు గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అటు వైపుగా వెళ్లే సమయంలో గుంతను గమనించకపోతే అందులో పడే ప్రమాదం ఉంది. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఆలూరు



ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు


బాలింతతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

వైద్య సేవలపై కలెక్టర్ ఆరా

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆరా తీశారు. కోడుమూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ సేవలు, ఓపీకి ఎంత మంది వచ్చారు తదితర వివరాలను సమన్వయకర్తతో మాట్లాడి ఆరా తీశారు. బాలింతలతో మాట్లాడారు. జననీ సురక్ష యోజన కింద డబ్బులు వస్తున్నాయా అని అడిగారు. లబ్ధిదారుల ఖాతాలోనే జమవుతాయని వైద్యాధికారి నాగరాజు వివరించారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. గూడూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల అధ్యక్షుడిగా కాంతారావు, ప్రధాన కార్యదర్శిగా షబ్బీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. సమస్యల పరిష్కరిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) మంత్రాలయం : 98859 97892 గోనెగండ్ల : 80085 73827

ఎమ్మిగనూరు: **సమస్య:** పట్టణంలోని గీతా నగర్ కాలనీలో కంకర వేసి రోడ్డును వేయకుండా వదిలేశారు. నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి. **- రంగన్న**

సమాధానం: పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. **- శరత్, ఏఈ**

అందని దుప్పట్లు.. చలికి ఇక్కట్లు

పరిశీలన

☛ వసతి గృహాల్లో రాత్రివేళ చిన్నారుల అవస్థలు

☛ దోమలు, చలితో నిత్యం నరకయాతన

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల వసతి గృహాలను నిర్లక్ష్యం చేయడంతో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం చలికాలం ఆరంభమైంది. ఈ ఏడది ఇప్పటి వరకు వసతి గృహాలకు దుప్పట్లు పంపిణీ కాలేదు. దీంతో చిన్నారులు చలికి వణుకుతున్నారు. చాలాచోట్ల కిటికీలకు తలుపులు, అద్దాలు లేకపోవడం, ఫ్యాన్లు తిరగకపోవడంతో దోమలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 'న్యూస్‌టుడే' పలు వసతి గృహాలను పరిశీలించగా, విద్యార్థుల కష్టాలు వెలుగు చూశాయి.

పంకాలు తిరగక అవస్థలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం బీసీ వసతి గృహంలో 145 మంది వసతి పొందుతున్నారు. ఇక్కడ గదులు సరిగా లేక, ఫ్యాన్లు సరిగా తిరగక రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంకాలు గాలి రావడం లేదు. కిటికీలకు తెరలు ఏర్పాటు చేయకపోవడంతో దోమలతో సరిగా నిద్రపోవడం లేదు. ట్రంకు పెట్టెలు, పళ్లాలు, గ్లాసులు, బెడ్‌షీట్లు పంపిణీ చేయలేదు. విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్నారు. ఒక్క దుప్పటిని ముగ్గురు కప్పుకొంటున్నారు.



పగిలిన కిటికీల అద్దాలు

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగిలోని బీసీ వసతి గృహంలో 210 మంది విద్యార్థులున్నారు. గతేడాది 200 మందికి దుప్పట్లు అందజేశారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో కొంత మంది చిన్నారులు కిందే పడుకుంటున్నారు. మరికొందరు పక్క విద్యార్థుల దుప్పట్లో నిద్రిస్తున్నారు. వసతి గృహంలో 24 గదులున్నాయి. వాటి కిటికీల అద్దాలు పగిలిపోవడంతో రాత్రిపూట దోమలతో అవస్థలు పడుతున్నారు.



ఒక్కో గదిలో 35 మంది

నందవరం, న్యూస్‌టుడే: నందవరంలోని సమీకృత సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 305 మంది విద్యార్థులున్నారు, 12 గదులున్నాయి. ఒక్కో గదిలో 10 లేక 15 మంది ఉండాలి, కానీ 30 నుంచి 35 మంది కిపైగా ఉన్నారు. విద్యార్థులు నివసించే ప్రదేశంలో చెత్తాచెదారంతో దుర్వాసన వస్తోంది. రెండేళ్ల నుంచి దుప్పట్లు రాకపోవడంతో రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు గదులకు కిటికీలు లేక దోమలతో అల్లాడుతున్నారు. వసతి గృహం చుట్టూ ముళ్ల కంప చెట్లు, చెత్తాచెదారం ఉండటంతో రాత్రివేళ విద్యార్థులు భయపడుతున్నారు.



ఇంటి నుంచి తెచ్చుకొని..

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు నగర పంచాయతీలో ఎస్సీ, బీసీ వసతి గృహం ఉంది. ఇక్కడ 500 మంది కోసం ఏర్పాటు చేసినా, ప్రస్తుతం వసతి పొందుతున్నది 200 మంది మాత్రమే. ప్రభుత్వం బెడ్‌ షీట్లు అందించకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకొని కప్పుకొంటూ కాలం వెళ్లదీస్తున్నారు.



నీరు నిలిచి.. కుంటను తలపించి

మండలంలోని వై.కానాపురం ముఖ ద్వారంలో ప్రధాన దారి వెంట నిలిచిన నీరు కుంటను తలపిస్తోంది. వర్షం నీరు వెళ్లేందుకు కాల్వలు లేకపోవడంతో ఇక్కడ నీళ్లు నిలుస్తున్నాయని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు.



– న్యూస్‌టుడే, వై.కానాపురం (గూడూరు)

మరమ్మతులు చేయండి.. మంచినీళ్లు ఇవ్వండి

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మూడు నెలలుగా తాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కళాశాలలో సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ నాడు-నేడు కింద అభివృద్ధి పనులు చేపట్టడంతో దాహార్తి తీర్చేందుకు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. ఇది మూడు నెలలుగా పని చేయడం లేదు. దీంతో నిరుపయోగంగా మారింది. ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేపట్టి తాగునీటి కష్టాలు తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, గోనెగండ్ల

నిలిచిన జలం.. రవాణా నరకం

కోసిగి ప్రధాన రహదారిపై పెద్ద గుంత పడటంతో నీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే గేట్ నుంచి దత్తు దాబా వరకు రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో వాహనదారులు ఈ మార్గంలో పోవాలంటేనే వణుకుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోసిగి



ఫ్యాక్షన్ గ్రామాలు సందర్శించిన డీఎస్పీ

కౌతాళం, న్యూస్‌టుడే: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలు రౌడూరు, నదిచాగిలో పోలీస్ పికెటింగ్‌ను గురువారం సాయంత్రం డీఎస్పీ ఉపేంద్రబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ.. అల్లర్లకు, గొడవలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అశోక్ కుమార్, ఎస్సై రిజ్వాన్ పాల్గొన్నారు.

25న ఉద్యోగమేళా

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులోని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ చదివిన 35 ఏళ్లలోపు వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మతిస్థిమితంలేని వివాహితతో అసభ్య ప్రవర్తన

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామంలో మతిస్థిమితం లేని ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి బుధవారం అసభ్యకరంగా ప్రవర్తించినట్లు గ్రామస్థులు గురువారం తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని పట్టుకొని దేహశుద్ధి చేశారు.

పోలీసు అమరవీరుల సేవలు మరువలేం

కౌతాళం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సేవలు మరువలేమని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు అన్నారు. గురువారం కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కౌతాళం సీఐ అశోక్‌కుమార్, ఎస్సై రిజ్వాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమ్మాన్యుయల్ పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాకు రూ.1,200 తగ్గింపు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్లో అక్టోబరు మొదటి వారం వరకు వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7 వేలకుపైగా వ్యాపారులు కొన్నారు. గురువారం క్వింటా గరిష్ఠ ధర రూ.5,810, మధ్యస్థం రూ.4,841, కనిష్ఠం రూ.1,810కు వ్యాపారులు కొనుగోలు చేశారు. సుమారు 18 రోజుల వ్యవధిలో క్వింటాకు రూ.1,200 వరకు తగ్గింది. ఈ ఏడాది వేరుసెగన క్వింటా గరిష్ఠ రూ.8 వేల వరకు పలికింది. ప్రస్తుతం క్వింటా రూ.6 వేల్లోపు ధర తగ్గడంతో గిట్టుబాటు కాక రైతులు నష్టపోతున్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

గూడూరు, న్యూస్‌టుడే: భావితరాలకు పునాది వేయాల్సిన యువత మత్తుకు బానిసై జీవితాలను చిత్తు చేసుకుంటున్నారని, మద్యానికి దూరంగా ఉండాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు పేర్కొన్నారు. గూడూరు నగర పంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించగా, ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ రాజేశ్, ఆంగ్ల అధ్యాపకుడు శ్రీరాం పాల్గొన్నారు.

వరద నీటి ఉద్ధృతి పరిశీలన

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి దిగువకు వదులుతున్న నీటితో మంత్రాలయంలో నీటి ప్రవాహం పెరుగుతోంది. గురువారం మంత్రాలయంలోని గంగమ్మ ఆలయం వద్ద నీటి ఉద్ధృతిని సీఐ రామాంజులు, ఎస్సై పరమేశ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పరిశీలించారు. నదిలోని పుష్కరఘాట్‌లో పిల్లలను ఆడించే వ్యాపారులు, ఒంటె, గుర్రాల వ్యాపరం చేసుకునేవారిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, పురాణిక్‌తో కలిసి నది ప్రవాహాన్ని పరిశీలించారు. నదిలోకి భక్తులు వెళ్తుండటంపై మఠం మేనేజర్ అసహనం వ్యక్తం చేశారు.


గంగమ్మ ఆలయం వద్ద వరదను పరిశీలిస్తున్న సీఐ రామాంజులు, ఎస్సై పరమేశ్


ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులతో అధ్యాపక బృందం

అనే అంశంపై 120 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం వరికి ధ్రువపత్రాలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

డిసెంబరులోగా పూర్తి చేయాలి

గూడూరు, న్యూస్‌టుడే: గృహ నిర్మాణాలు డిసెంబరులోగా పూర్తి చేయాలని ఆర్డీవో సందీప్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్, గృహ నిర్మాణ శాఖ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం నగర పంచాయతీలోని లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఈఈ ప్రభాకర్, డీఈ వాసుదేవరావు, మున్సిపల్ మేనేజర్ విజయలక్ష్మి, ఎంఐసీ జమన్న పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యంతో యువతకు ఉపాధి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మారుతున్న సమాజంలో సాంకేతిక నైపుణ్యంలో రాణిస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎర్రకోట సెయింట్‌జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీరన్న అన్నారు. గురువారం సాంకేతిక పద్ధతి, అంకాత్మక చిత్రవిశ్లేషణ

పోలియోపై అవగాహన ర్యాలీ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచ పోలియో దినం సందర్భంగా గురువారం పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నటరాజ్‌రెడ్డి మాట్లాడుతూ.. సమష్టి కృషితో పోలియో రహిత దేశంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు సుధాకర్, బీరప్ప, ఎం.రాజు, మాచాని శివశంకర్ పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, రోటరీ క్లబ్ సభ్యులు

సంపూర్ణ సేవకు రూ.2 లక్ష విరాళం..

మంత్రాలయం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన నీరజా, రమేశ్ దంపతులు రాఘవేంద్ర స్వామి మఠంలో అన్నదానానికి రూ.లక్ష విరాళం అందజేసినట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. గురువారం వారు మంత్రాలయానికి వచ్చి గ్రామదేవత మంచాలమ్మ, మూలబృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతికి రూ.లక్ష అందజేశారు.

ప్రజా సమస్యలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి

సి.బెళగల్, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి పేర్కొన్నారు. గురువారం ఆయన సి.బెళగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాణెమ్మ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. పింఛన్లు, రహదారులు, కాల్వలు, రీసర్వే నష్టాలపై 80 మంది దరఖాస్తులు సమర్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీపీ బి.మునెప్ప, గ్రామీణ నీటి పారుదల శాఖ డీఈఈ శ్రీనివాసులు, తెదేపా నాయకులు బి.చిన్నతిమ్మప్ప, ధనుంజయ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

18 అర్జీల స్వీకరణ

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెంచికలపాడులో గురువారం తహసీల్దార్ రామాంజనేయులు గ్రామసభ నిర్వహించారు. భూముల రీసర్వేకు సంబంధించి 18 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిపై సమగ్ర దర్యాప్తు చేసి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లతమ్మ, డీటీ లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజనేయులు

గార్లదిన్నెలో...

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గార్లదిన్నెలో రీసర్వేపై గురువారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ శేషఫణి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన 14 మంది రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

గ్రామసభలో 24 ఫిర్యాదులు

నారాయణపురం (మంత్రాలయం), న్యూస్‌టుడే: మండలంలోని నారాయణపురం గ్రామంలో గురువారం నిర్వహించిన సభలో రీసర్వేపై 24 ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ రవి తెలిపారు.

కార్మికులను క్రమబద్ధీకరించాలని ధర్నా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పురపాలక కార్మికులను క్రమబద్ధీకరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు తిమ్మగురుడు డిమాండు చేశారు. గురువారం పురపాలక కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. పురపాలకలో ఏళ్ల తరబడి పారిశుద్ధ్య పనులు చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. తక్షణమే కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, మునిరంగడు, నరసప్ప, విజేంద్ర, శ్రీనివాసులు, వీరేంద్ర, ముత్తర్, రాజ్, నబీసాబ్, విజయ్, నరసింహులు పాల్గొన్నారు.



పురపాలక కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రెండు వరుసల దారి వేయాలి

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని పోలకల్ నుంచి ఎమ్మిగనూరు రహదారి గుంతలు పడి అధ్వానంగా మారిందని, ఇక్కడ రెండు వరుసల రహదారి నిర్మించాలని సీపీఎం గ్రామ కమిటీ సభ్యులు డిమాండు చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడరాఉ. సి.బెళగల్ బస్టాండులో మహిళలకు మూత్రశాలలు నిర్మించాలని కోరారు. ఎన్టీఆర్ నగర్, జర్నలిస్టు కాలనీల్లో వీధి దీపాలు వేయాలన్నారు. సీపీఎం నాయకులు మోహన్, ఉసేన్, రంగన్న పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధంలాంటిది


ఓటరు నమోదు పత్రం అందజేస్తున్న తహసీల్దార్, అధ్యాపక బృందం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే; ఓటు వజ్రాయుధంలాంటిదని, యువత చేతిలో దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని పెద్దకడబూరు తహసీల్దార్ శ్రీనాథ్ అన్నారు. గురువారం ఎమ్మిగనూరు మహాయోగి లక్ష్మమ్మ అవ్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటును వినియోగించుకోవాలన్నారు. ప్రజాపరిపాలన అందాలంటే యువత ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా, ఉప తహసీల్దార్ గురురాజారావు, వైస్ ప్రిన్సిపల్ క్రాంతికుమార్, అధ్యాపకురాలు సుశీలమ్మ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ రూతమ్మ అధ్యక్షతన నిర్వహాహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సాగు, తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని జీడీపీ ఏఈఈ నారాయణకు సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

మంత్రాలయం, న్యూస్‌టుడే: మాధవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజు డిమాండు చేశారు. గురువారం సంఘం నాయకులతో కలిసి ఆయన ఎంపీడీవో శోభారాణికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కాలనీలో కొన్నేళ్లుగా తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సురేశ్, మారెప్ప, తిక్కన్న, జయరాజు, ఏలియా, అశోక్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

మంత్రాలయం, న్యూస్‌టుడే: మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రాలయం నియోజకవర్గ తెదేపా నాయకుడు రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రకటించిన మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను 24వ తేదీ నుంచి బుకింగ్స్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. దీపావళి నుంచి లబ్ధిదారులకు పథకం అందుబాటులోకి వస్తుందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని మాచాని సోమప్ప బాలికల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి అన్నారు. గురువారం రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ ఎస్‌జీఎఫ్‌కు ఎంపికైన బాలిక అనూను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయిని సృజనకుమారి, నాగేశ్వరి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

కోసిగి, న్యూస్‌టుడే: ప్రతి పౌరుడు తమకు కావాల్సిన సమాచారాన్ని ప్రభుత్వం నుంచి తెలుసుకోవడానికి సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందని ఏవో రాజు సూచించారు. గురువారం కోసిగిలోని వ్యవసాయ కార్యాలయంలో సహ చట్టంపై అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు హనుమంతు, ఈరేశ్, పవిత్ర పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

కౌతాళం, న్యూస్‌టుడే: ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సుబ్బరాజు అన్నారు. గురువారం ఆయన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మదన్‌శంకర్, ఈసీ రఫీక్ పాల్గొన్నారు.

ఇంటింటికి చెత్తబుట్టల పంపిణీ

కౌతాళం, న్యూస్‌టుడే: మండలంలోని హాల్వి గ్రామంలో గురువారం ఇంటింటికి చెత్తబుట్టల పంపిణీ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ కరీం, సర్పంచి క్రాంతి, గ్రామ నాయకులు వడ్డె ఉసేని, ఈడిగ హనుమంతగౌడ్, కురువ నాగేశ్ పాల్గొని వాటిని అందజేశారు.

ఈనామ్ పంట కొనుగోలుకు సర్వర్ మొరాయింపు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఈనామ్ సర్వర్ మొరాయింపుతో పంట కొనుగోలు పాత విధానంలో మాన్యువల్‌గా చేపట్టారు. ఐదు రోజులుగా ఈనామ్ సర్వర్ సమస్యతో ఆన్‌లైన్‌లో టెండర్ విధానం నిలిచిపోయింది. టెండర్ మాన్యువల్‌గా కోడ్ చేసి డబ్బాలో వేస్తారు, తర్వాత మార్కెట్ సిబ్బంది టెండర్ ఫారాలను తీసుకొని అధిక ధర కోడ్ చేసిన వ్యాపారికి సరకు కొనుగోలు చేసుకునేందుకు అనుమతి ఇస్తారు. ఈనామ్ విధానంలో ప్రక్రియ వేగంగా జరుగుతుంది. ప్రస్తుతం మార్కెట్‌కు సరకు రాక తగ్గింది. కార్యదర్శి పద్మావతి మాట్లాడుతూ... సర్వర్ పని చేయడం లేదని, ఈనామ్ ద్వారా పంట కొనుగోలు చేపడతామన్నారు.

నియంత్రిక నిరీక్షణకు నవ మాసాలు

☛ విద్యుత్తు కనెక్షన్లకు కర్షకుల ఎదురుచూపు

కౌతాళం, న్యూస్‌టుడే: వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులు గత తొమ్మిది నెలలుగా ఎదురుచూస్తున్నారు. కనెక్షన్ ఇస్తే బోరుబావుల నుంచి నీటిని తోడుకుని పంటలు పండించుకోవచ్చని అన్నదాతలు ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వలేదు. డీడీలు చెల్లించి నిరీక్షిస్తున్నారు.


వర్షాధారం కింద సాగు చేసిన పత్తి పంట

మంత్రాలయం నియోజకవర్గంలో 800 మంది రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్నా ఇంత వరకు సామగ్రి, విద్యుత్తు నియంత్రిక అందక ఎదురుచూస్తున్నారు. 800 కనెక్షన్లకు సంబంధించి సుమారు 140 నియంత్రికలు రావాల్సి ఉంది. గత తొమ్మిది నెలలుగా ఎలాంటి సామగ్రి రావడం లేదు.

ఒక్కో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కింద 3 నుంచి 4 ఎకరాల భూమి సాగవుతోంది. 800 కనెక్షన్ల కింద సుమారు 2,400 నుంచి 3,200 ఎకరాల వరకు పండించుకుంటున్నారు. రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే కనెక్షన్లను ఇచ్చి ఉంటే 3,200 ఎకరాల వరకు వరి, మిరప, చెరకు తదితర పంటలను రైతులు సాగు చేసుకుని లాభాలు ఆర్జించేవారు. దరఖాస్తులు తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో ఖరీఫ్ పంట వర్షాధారంగా మారింది. దీంతో పత్తి, ఆముదం, సజ్జ, కొర్ర, కంది వంటివి సాగు చేసుకున్నారు. వ్యవసాయ కనెక్షన్ ఆలస్యమవడంతో రైతులు ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం కోల్పోతున్నారు.

మండలం	దరఖాస్తు దారులు	అందాల్సిన నియంత్రికలు
కౌతాళం	200	50
పెద్దకడబూరు	200	30
కోసిగి	141	33
మంత్రాలయం	259	27

రెండు నెలల్లో సామగ్రి అందుతుంది

- శాంతిస్వరూప్, ఏడీఈ, మంత్రాలయం

గత సార్వత్రిక ఎన్నికల ముందు ఫిబ్రవరి నుంచి వ్యవసాయానికి సంబంధించి సామగ్రి, స్తంభాలు, నియంత్రికలు ఏమీ రాలేదు. ఈ ప్రభుత్వంలో రెండు నెలల్లో పూర్తి స్థాయిలో సామగ్రి, నియంత్రికలు మంజూరవుతాయి. రాగానే కనెక్షన్లను అందజేస్తాం.

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

సైలెన్సర్ శబ్దం మితిమీరితే చర్యలు


సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్న ఎస్పీ జి.బిందుమాధవ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : బైకు సైలెన్సర్ల నుంచి వెలువడే శబ్దం మితిమీరితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జి.బిందుమాధవ్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు 110 ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తొలగించారు. కర్నూలు పాత బస్టాండు కొండారెడ్డి బురుజు వద్ద ఎస్పీ జి.బిందుమాధవ్ గురువారం జెండా ఊపి రోడ్డు రోలర్‌తో వాటిని తొక్కించి ధ్వంసం చేయించారు. కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్, సీఐ మన్సురుద్దీన్, రామయ్యనాయుడు, మురళీధర్‌రెడ్డి, నాగరాజరావు పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ కార్యక్రమం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో కర్నూలు సబ్ డివిజన్ పరిధిలోని రైతు సేవ కేంద్రాల సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పత్తి, కంది పంటలపై ఆశించే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, శనగ పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆత్మ పీడీ రత్నప్రసాద్, డీపీడీ శ్రీలత, ఏడీఏ సాలురెడ్డి, డాట్ సెంటర్ శాస్త్రవేత్త రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణ : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : సమస్య : బిర్లాగేటు సమీపంలో రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలు సాగే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తగిన చర్యలు తీసుకోవాలి. **- నవీన్**

సమస్య : ముజఫర్‌నగర్‌లోని వీధుల్లో కాలువలు శుభ్రం చేయాలి. వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. **- స్థానికులు**

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. **- నగరపాలక సంస్థ అధికారులు**

కర్నూలు గ్రామీణ : సమస్య: మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామం గొందిపర్లకు వెళ్లే ప్రధాన రహదారిలో పందుల సమస్య తీవ్రంగా ఉంది. **- శేఖర్. ఇ.తాండ్రపాడు గ్రామం**

సమస్య: పంచలింగాల గ్రామ రహదారిపై ఇసుక మేట వేయడంతో ద్విచక్ర వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటోంది. **- వెంకటేశ్, పంచలింగాల గ్రామం**

సమాధానం: సమస్యలు పరిశీలించి వీలైనంత త్వరలో పరిష్కరిస్తాం. **- మండల అధికారి**

ప్రజారోగ్యానికి పెద్దపీట

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.2.10 లక్షల చెక్కులను ఎమ్మెల్యేతోపాటు తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి బాధితులకు గురువారం అందజేశారు. ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు నాగిరెడ్డి, చరణ్‌యాదవ్, బీసన్న, శ్రీనివాసులు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి

వివిధ విభాగాల తనిఖీ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు వైద్యశాలలోని పలు విభాగాలను పర్యవేక్షకుడు డా.ప్రభాకరరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఓపీ కౌంటరు వద్ద రోగుల సౌకర్యార్థం షెడ్లకు సంబంధించి అంచనాలు రూపొందించాలని ఇంజినీర్లను ఆదేశించారు.

మందుల కొరత తీర్చండి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: కర్నూలు సర్వజన ఆసుపత్రిలో మందుల కొరత ఉందని, ఫలితంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారని భాజపా జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, నాయకులు యోగానంద్‌చౌదరి, సూర్యప్రకాశ్ తదితరులు అన్నారు. వారు గురువారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను మంగళవారం కలిసి సమస్యలు విన్నవించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలులో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల మండల, జిల్లాస్థాయి పోటీల్లో ఇ.తాండ్రపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం శైలజ, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.జయ, గణపతి గురువారం అభినందించి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.

గుత్తేదారుల అవతారం.. బిల్లుల్లో చేతివాటం

☛ నగరపాలకలో గాడితప్పిన పాలన

☛ కార్పొరేటర్లు నిలదీసినా స్పందన కరవు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరాభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. రహదారుల విస్తరణ, మెరుగైన పారిశుద్ధ్యానికి పాలకులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా.. గతంలో అధికారులు చేసిన తప్పిదాల కారణంగా నగరపాలకకు నష్టం వాటిల్లింది. గత కొన్ని సమావేశాల్లో పలువురు కార్పొరేటర్లు అక్రమాలపై గళం విప్పినా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం జరిగే సమావేశంలోనైనా ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చించాల్సి ఉంది.

న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలకసంస్థ

ఇష్టానుసారంగా ఖర్చు

కర్నూలు నగరంలో గత మూడేళ్ల కాలంలో ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేశారు. రూ.కోట్లతో వివిధ పనులు చేపట్టారు. ప్రజాప్రయోజనాలను గాలికి వదిలేశారు. వైకాపా నేతల కనుసన్నల్లో అధికారులు పనిచేశారు. ఫలితంగా నిధులన్నీ వృథాగా మారాయి. సుందరీకరణ పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టారు. హెడ్ వాటర్ వర్క్స్‌లో భారీగా అక్రమాలు వెలుగుచూశాయి. అధికారులే గుత్తేదారుల అవతారమెత్తారు. కొన్ని ప్రాంతాల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణాలు చేపట్టారు. కొన్ని పనులు పూర్తికాకుండానే బిల్లులు చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. భారీగా అక్రమాలు వెలుగుచూసినా చర్యలు మాత్రం శూన్యమే.

అక్రమ ధారలు

నగర పరిధిలో 52 వార్డులు ఉండగా.. 70 వేలకుపైగా కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. కాగా కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. అక్రమంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చి రూ.లక్షలు స్వాహా చేశారు. నగర పరిధిలో 3 వేలకుపైగా అక్రమ కనెక్షన్లు ఇచ్చినట్లు సమాచారం. ఫలితంగా నగరపాలక సంస్థ ఆదాయానికి భారీగా గండి పడింది. అధికారుల పర్యవేక్షణ కరవవడంతో అవినీతి యథేచ్ఛగా సాగింది.

తాఖీదులతో సరి

నగరపాలకలో ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ అధికారుల సహకారంతో వివిధ పనులు చేశారు. పనులకు సహకరించిన అధికారులకు కేవలం మెమోలు మాత్రమే జారీ చేసి వదిలేశారు. ఓ అధికారికి కావాలనే మెమో ఇవ్వలేదన్న ఆరోపణలున్నాయి. మరోవైపు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండాలంటే భారీగా నగదు ఇవ్వాలంటూ కొందరు మధ్యవర్తిత్వం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిధులు పక్కదారి



☛ అశోక్‌నగర్ హెడ్ వాటర్‌వర్క్స్, మునగాలపాడులోని 15 ఎంఎల్‌డీ ట్రీట్‌మెంటు ప్లాంట్ నిర్వహణ కోసం రూ.కోట్లు నిధులు ఖర్చు చేశారు. నీటి శుద్ధి, పైపులైను లీకేజీలు, మోటార్ల మరమ్మతుల పేరుతో రూ.కోట్లు పక్కదారి పట్టించారు. అక్రమాలు జరిగినట్లు ఆధారాలున్నా చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలున్నాయి.

☛ నగరంలోని పలు ప్రాంతాల్లో కూడళ్ల అభివృద్ధి పేరుతో రూ.లక్షల నిధులు వెచ్చించారు. ఉన్నవాటిని కూలగొట్టి తిరిగి కొత్తగా నిర్మిస్తున్నారు. భారీగా ప్రజాధనం వృథా చేస్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారు.

పాలనలో పారదర్శకత అవసరం

కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. నగరాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తోంది. కర్నూలు నగరంలో ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం పాలకులు దృష్టి సారించారు. కల్లూరు కాలనీలతోపాటు శివారు ప్రాంతాలకు ప్రతిరోజూ మంచినీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, రహదారుల విస్తరణతోపాటు మురుగునీరు కేసీ కాలువలో కలవకుండా దారి మళ్లించేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పాలకులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నా కొందరి తీరుతో పరిస్థితి గాడి తప్పుతోంది. ఈ నేపథ్యంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

క్యాన్సర్ నియంత్రణకు కృషి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: క్యాన్సర్ నియంత్రణకు కృషి చేస్తున్నట్లు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ తెలిపారు. కర్నూలు నగర శివారు జగన్నాథగట్టుపై ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాలలో రిజిస్ట్రార్ గురుమూర్తి ఆధ్వర్యంలో గురువారం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై త్వరలో సర్వే చేస్తామన్నారు. ట్రిపుల్ ఐటీ కళాశాల దత్తత తీసుకున్న గ్రామాల్లో మొదటగా సర్వే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీసన్న, డాక్టర్ సందీప్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


ట్రిపుల్ ఐటీ కళాశాల అధికారులతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు

గుంతల మార్గం ప్రాణాలతో చెలగాటం

కర్నూలు నగర శివారులోని పుల్లారెడ్డి దంత కళాశాల సమీపంలో ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయకపోవడం.. దగ్గరికి వచ్చే దాకా కనపడకపోవడంతో పలువురు అదుపు తప్పి పడిపోతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు బీక్యాంపు



నాణ్యత.. మట్టిలో కలిపారు

నగరంలో స్మార్ట్ స్ట్రీట్‌లో భాగంగా బిర్లా గడ్డ సమీపంలో రూ.లక్షలు వెచ్చించి ప్లాట్‌ఫాం నిర్మించారు. పెద్దఎత్తున టైల్స్ వేశారు. పనుల్లో నాణ్యత లోపించడంతో నిర్మించిన కొద్ది నెలలకే రూపు కోల్పోతోంది. ఫలితంగా ప్రజాధనం వృథా అవుతోంది. - న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ



పూర్తిస్థాయిలో బీమా చేయించాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : రాయలసీమ, ఇతర ప్రాంతాల్లో రబీకి సంబంధించిన పంటలకు డిసెంబరు 15లోగా బీమా చేయించాలని, కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు జారీ చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఆదేశించారు. ఆయన గురువారం విజయవాడ నుంచి పంటల బీమా అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కర్నూలు నుంచి కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డా.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, సీపీవో హిమప్రభాకర్ రాజు, జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తేనే గుర్తింపు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే అండర్-14 బాలుర జట్టును ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎన్.గిడ్డయ్య గురువారం ప్రకటించారు. బాలుర విభాగంలో తాయన్న, వినయ్, యశ్వంత్, రేయాన్, అలీ, ఖలీల్, వెంకట్, వీరేంద్ర, వరుణ్‌గౌడ్, హుస్సేన్‌బాషా, రోహిత్ తదితరులను ఎంపిక చేశారు. బాలికల జట్టులో లాస్య, శశికళ, గీత, అను, లలిత, మానస తదితరులకు స్థానం లభించింది. వీరిని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు తదితరులు అభినందించారు. పోటీల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.


ఎంపికైన క్రీడాకారిణులు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: దేశంలో 18 ఏళ్లు నిండిన ప్రతి యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు నమోదుపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఓటుపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లాలెప్ప, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

దేశానికి సేవ చేయండి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : యువత దేశసేవ చేసేందుకు వాయుసేనలో చేరాలని సికింద్రాబాద్ ఎయిర్‌మెన్ ఎంపిక కేంద్రం అధికారులు సందీప్, సురేందర్‌సింగ్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెట్కూరు-యువజన సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో అగ్నివీర్ వాయు పోస్టుల ఎంపిక ప్రక్రియపై జరిగిన సదస్సులో వారు మాట్లాడారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ప్రభుత్వ నర్సుల సంఘం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీలావతి, బంగారి తదితరులు గురువారం ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.ప్రభాకరరెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు. నూతన కార్యవర్గానికి ఆయన అభినందనలు తెలిపారు. సంఘం నాయకులు మాట్లాడుతూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. నర్సింగ్ పర్యవేక్షకురాలు సావిత్రి బాయి, సోమేశ్వరి, శాంతి లత పాల్గొన్నారు.


డా.ప్రభాకరరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నర్సింగ్ సంఘం నాయకులు

సంక్షిప్త సమాచారం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల వ్యవసాయాధికారిణిగా రూపస్ రోజారాణిని నియమించారు. ఆయన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో ఏవోగా పనిచేస్తూ ప్రస్తుతం కర్నూలు ఏవోగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న ఏవోను అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు.

తడకనపల్లె (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: తడకనపల్లె గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి 147 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్లూరు నుంచి పందిపాడు మీదుగా లక్ష్మీపురం వరకు రహదారి విస్తరణ చేయాలని సీపీఎం న్యూ సిటీ కార్యదర్శి సభ్యులు కె.సుధాకరప్ప, సీహెచ్ సాయిబాబా డిమాండ్ చేశారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

కర్నూలు నగరపాలకసంస్థ న్యూస్‌టుడే: నగరంలోని పలు సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ తెలిపారు. ఆయన గురువారం గొలిగేరిలోని 129వ వార్డు సచివాలయంలో శిబిరాన్ని పరిశీలించారు.

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యుడు సురేంద్రయాదవ్, కల్లూరు మండల రైతు సంఘం కార్యదర్శి కృష్ణనాయక్ ఒక ప్రకటనలో కోరారు.

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : అరుంధతినగర్, మారుతినగర్ తదితర ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి మహేష్ గురువారం సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులోని ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 26న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

కర్నూలు వైద్యాలయం : సర్వజన వైద్యశాలలో పనిచేసే సిబ్బందికి పలు అంశాలపై అవగాహన అవసరమని పర్యవేక్షకుడు డా.ప్రభాకరరెడ్డి అన్నారు. టీబీ ముక్త్ భారత్ ఐపీసీ శిక్షణలో భాగంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


రచనల్లో మేటి.. ఆదర్శంగా నిలిచి

పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయొచ్చని సర్వేపల్లి విద్యానిలయం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేపీ అరుణశ్రీ అన్నారు. స్థానిక పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ప్రథమ స్థానంలో షేక్ సమ్రీన్ (పదో తరగతి), ద్వితీయ స్థానంలో జి.శ్రీలాస్య (ఎనిమిదో తరగతి), తృతీయ స్థానంలో షేక్ అఫీఫా తెహసీన్ (పదో తరగతి) నిలిచారు. వారికి ఆమె బహుమతులను అందజేశారు. - న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ


సర్వేపల్లి విద్యానిలయం పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


బహుమతులు అందుకున్న విద్యార్థులు

'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 'ఈనాడు' ఆధ్వర్యంలో కర్నూలు మాధవనగర్‌లోని రవీంద్ర ఇంగ్లిషు మీడియం పాఠశాలలో గురువారం వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రథమ స్థానంలో టి.భవ్యశ్రీ (ఎనిమిదో తరగతి), ద్వితీయ స్థానంలో సీహెచ్ దేవచరణ్ విజ్వల్ (పదో తరగతి), తృతీయ స్థానంలో ఎస్.మన్య (తొమ్మిదో తరగతి) నిలిచారు. వారికి పాఠశాల కరస్పాండెంటు వీబీవీ సుబ్బయ్య, కార్యనిర్వాహకులు పి.బాలు, ఎస్కే మెహముద, టి.సురేఖ, వరప్రసాద్, సమన్వయకర్తలు జి.సౌజన్య, జి.సుభద్ర బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ


రవీంద్ర పాఠశాలలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నేడు రైతుబజారుకు సెలవు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కర్నూలు సి.క్యాంపులోని రైతుబజారుకు శుక్రవారం సెలవు ఉంటుందని ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుబజారును శుభ్రం చేస్తుండటంతో సెలవు ఉంటుందని, శనివారం తిరిగి కూరగాయల విక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. వినియోగదారులు దీనిని గమనించాలని కోరారు.

పోస్టుల భర్తీలో అన్యాయం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పలు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను ప్రభుత్వం విడుదల చేసిందని, అధికారులు వీటిని పారదర్శకంగా భర్తీ చేయడం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్, రాష్ట్ర కార్యదర్శి రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగాల ప్రకటన విడుదల చేస్తే.. కొన్ని పోస్టులు లేవంటూ అధికారులు నిరుద్యోగులను గందరగోళానికి గురి చేశారన్నారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు రాజు, ఆర్యన్, విశ్వ, అనిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వసతి కునుకు

◆ విద్యార్థులకు అందని దుప్పట్లు

◆ అరకొర గదులతో నరకయాతన

కర్నూలు నగరంతోపాటు ఓర్వకల్లు, కల్లూరు మండలాల పరిధిలోని వసతిగృహాల్లో సరైన సౌకర్యాలు కరవయ్యాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు అందుబాటులో లేవు. చివరికి ఉన్న గదుల్లోనే నిద్రించాల్సిన పరిస్థితి. మరోవైపు మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. పలు ప్రాంతాల్లో తలుపులు ఊడిపోయినా పట్టించుకోవడం లేదు. నిరంతరం అధికారులు తనిఖీ చేసి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాల్సి ఉన్నా దృష్టి సారించడం లేదు. చివరికి కష్టాలతోనే సహవాసం చేస్తున్నారు. - ఈనాడు, కర్నూలు, న్యూస్‌టుడే, ఓర్వకల్లు

📍	ప్రాంతం
🏠	వసతి గృహం
👥	విద్యార్థుల సంఖ్య
?	సమస్య

4 గదులు.. 140 మంది

ప్రాంతం	ఓర్వకల్లు
వసతి గృహం	ఎస్సీ బాలుర వసతిగృహం
విద్యార్థుల సంఖ్య	140 మంది


దుప్పట్లు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

? ఓర్వకల్లులోని ఎస్సీ బాలుర వసతిగృహంలో కనీస వసతులు కరవయ్యాయి. 4 గదులు మాత్రమే ఉన్నాయి. ఫలితంగా ఒక్కో గదిలో సుమారు 35 మంది విద్యార్థులు నిద్రించాల్సిన పరిస్థితి. దీనికితోడు గత ప్రభుత్వం దుప్పట్లు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా విద్యార్థులు చలికి వణికిపోతున్నారు.

మెనూ అమలు అంతంతే..

ఓర్వకల్లులో వసతిగృహం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయి. మెనూ అమలులోనూ నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. కోడిగుడ్లు, చికెన్ సరిగా పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. కిటికీలకు ఏర్పాటుచేసిన మెష్ దెబ్బతినడంతో దోమల బెడదతో అల్లాడుతున్నారు. చల్ల గాలి వీస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పర్యవేక్షిస్తే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశముంది.

వరండాలో నిద్రించాల్సిందే..

ప్రాంతం	పెద్దపాడు
వసతి గృహం	ఎస్సీ బాలుర వసతిగృహం
విద్యార్థుల సంఖ్య	190 మందికిపైగా..



? ఇరుకు గదులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వందలాది మందికి 5, 6 గదులు మాత్రమే ఉన్నాయి. ఇవి సరిపోక చాలామంది వరండాల్లో నిద్రపోవాల్సిన దుస్థితి. దుప్పట్లు సైతం ఇవ్వకపోవడంతో వారి ఇబ్బందులు అన్నీఇన్నీకావు. చలికి వణకాల్సిన పరిస్థితి. దోమల బెడద తీవ్రంగా ఉండటంతో రోగాలు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని గుత్తి పెట్రోలు బంకు సమీప కాలనీకి చెందిన ప్రమీలమ్మ (53) ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె భర్త వెంకటేశ్వర్లు ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడి తీరు మారకపోవడంతో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం రాత్రి ఉరేసుకున్నారు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె సోదరుడు తిక్కస్వామి ఫిర్యాదు మేరకు కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు పాతబస్తీ రంగరాజ వీధికి చెందిన షేక్ హుస్సేన్‌బీ (60) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె వీకర్ సెక్షన్ కాలనీలో తన కుమారుడికి ఇంటికి వెళ్లారు. 22వ తేదీన బాత్‌రూంలో కింద పడటంతో తలకు గాయమైంది. వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్నూలు చేరిన భౌతికకాయాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : రహదారి ప్రమాదంలో మృతి చెందిన కర్నూలు పాతబస్తీకి చెందిన వ్యాపారి ప్రేమ్‌కుమార్, వాసవి భౌతికకాయాలు గురువారం నగరానికి చేరాయి. ఈనెల 23న వివాహ రిసెప్షన్ కార్యక్రమం నిమిత్తం తిరుపతి వెళ్తుండగా మార్గమధ్యలో అన్నమయ్య జిల్లాలో వీరి ఇన్నోవా వాహనాన్ని బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, అతని భార్య వాసవితోపాటు బంధువు సుచిత్ర ప్రాణాలు కోల్పోగా మరో నలుగురు గాయపడ్డారు. ప్రేమకుమార్ దంపతుల అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలిసింది.

అనాథ శవానికి అంత్యక్రియలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు రైల్వే పోలీసులు మానవత్వం చాటుకున్నారు. ఈనెల 21న హైదరాబాద్ నుంచి కర్నూలు వచ్చిన హంద్రీ ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ గుర్తుతెలియని వృద్ధుడు (65) మృతి చెందిన సంగతి విదితమే. అతని వివరాల కోసం పోలీసులు విచారించినా ఫలితం లేకపోయింది. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసినా వివరాలు తెలియలేదు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు గురువారం పాతబస్తీలోని జమ్మిచెట్టు శ్మశానవాటికలో అంత్యక్రియలు చేశారు.